




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 11 సంచిక :143 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం మంగళవారం 28 జనవరి 2025 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE :143 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM TUE 28 JANUARY 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam, Kakinada, Ongole Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Prakasam,Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur


## మాట తప్పడం ఇష్టంలేక ప్రజలకు వాస్తవం చెబుతున్నా

- ఏపీ ఆర్థిక పరిస్థితిపై చంద్రబాబు కీలక వ్యాఖ్యలు
- రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదని వెల్లడి
- ఆర్థిక పరిస్థితి పుంజుకోగానే పథకాలు అమలు చేస్తామని వివరణ
- కేంద్రం ఇచ్చిన నిధులను మాత్రం మళ్లించలేనని స్పష్టీకరణ



**పెన్ పవర్ డెస్క్:**ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై కీలక వ్యాఖ్యలు చేశారు. వైసీపీ పాలనలో ఏపీ ఆర్థిక పరిస్థితి బీహార్ కంటే దారుణంగా తయారైందని విమర్శించారు. విశాఖ ఉక్కు, అమరావతి, పోలవరం ప్రాజెక్టులకు కేంద్రం నిధులు ఇచ్చిందని వెల్లడించారు. డబ్బులు ఉంటే పథకాల అమలుకు క్షణం కూడా ఆలోచించనని చంద్రబాబు పేర్కొన్నారు. అలాగని, కేంద్రం ఇచ్చిన నిధులను మళ్లించలేనని స్పష్టం చేశారు.
మాట తప్పడం ఇష్టం లేక ప్రజలకు వాస్తవం చెబుతున్నానని, ఆర్థిక పరిస్థితి ఏమీ బాగాలేదని, ఆర్థిక పరిస్థితి పుంజుకోగానే పథకాలు అమలు చేస్తామని చెప్పారు. అప్పు చేసి అయినా సరే ఇచ్చిన మాట నిలబెట్టుకుంటాం... తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ వంటి పథకాలను అమలు చేస్తామని తెలిపారు. ఐదేళ్ల విలువైన సమయాన్ని ఏపీ కోల్పోయిందని, 2019 నాటి వృద్ధి రేటు కొనసాగి ఉంటే రాష్ట్ర సంపద పెరిగేదని అన్నారు. గత ప్రభుత్వ పాలన ఫలితంగా రూ.9.5 లక్షల కోట్ల అప్పులు, వాటికి వడ్డీలు చెల్లించాల్సి వస్తోందని వివరించారు. ఇప్పుడిప్పుడే అన్ని వ్యవస్థలను గాడిలో పెడుతున్నామని చంద్రబాబు తెలిపారు. సంక్షేమ పథకాల అమలులో ఎప్పుడూ వెనకడుగు వేయబోమని ఉద్ఘాటించారు.

## రోజాకు దావోస్ కు, జ్యూరిచ్ కు తేడా తెలియదు

- పాదయాత్ర... రాజకీయాల్లో ఎంబీఏ వంటిది: నారా లోకేశ్
- విశాఖలో కోర్టుకు హాజరైన మంత్రి నారా లోకేశ్
- మీడియా సమావేశంలో ఆసక్తికర వ్యాఖ్యలు
- రాజకీయాల్లోకి వస్తానని తెలుసు కాబట్టే స్టాన్ ఫోర్డ్ ఎంబీఏ ఎంచుకున్నానని వెల్లడి



**పెన్ పవర్ డెస్క్:**విశాఖలో కోర్టుకు హాజరైన అనంతరం మంత్రి నారా లోకేశ్ మీడియాతో మాట్లాడుతూ వైసీపీ నేతలపై ధ్వజమెత్తారు. దావోస్ లో తాము ఎంతో శ్రమించామని, కానీ వైసీపీ నేతలు అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఆర్కే రోజాకు దావోస్‌కు, జ్యూరిచ్‌కు తేడా తెలియదని ఎద్దేవా చేశారు. జ్యూరిచ్ లో తెలుగువారితో సమావేశమయినప్పుడు

వివరాలు 2లో..

## గద్దర్ ఒక మాజీ నక్సలైట్.. ఆయనకు పద్మ అవార్డ్ ఎలా ఇస్తారు..?



**పెన్ పవర్ డెస్క్:** ప్రజా యుద్ధ నౌక గద్దర్‌కు పద్మ అవార్డ్ ఇవ్వకపోవడంపై తెలంగాణ ప్రభుత్వం చేస్తోన్న విమర్శలకు కేంద్రమంత్రి, బీజేపీ కీలక నేత బండి సంజయ్ కౌంటర్ ఇచ్చారు. ఎంతో మంది బీజేపీ కార్యకర్తలను, ఎన్ కౌంటర్లలో పోలీసులను పొట్టన బెట్టుకున్న వ్యక్తి గద్దర్ అని.. అలాంటి వ్యక్తికి పద్మ అవార్డు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. మావోయిస్టుగా పని చేసి ఎంతో మంది ప్రాణాలు తీసిన వారిలో గద్దర్ ఒకరని.. ఆయనకు పద్మ అవార్డు ఇచ్చేదే లేదని కుండబద్దలు కొట్టారు.సోమవారం (జనవరి 27) కరీంనగర్లో బండి సంజయ్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

వివరాలు 2లో..

## జగన్ కు సుప్రీంకోర్టులో ఊరట

- రఘురామ పిటిషన్ ను తోసిపుచ్చిన సుప్రీం ధర్మాసనం
- బెయిల్ రద్దు పిటిషన్ పై ప్రత్యేకంగా విచారణ అక్కర్లేదన్న కోర్టు
- తన పిటిషన్ ను వాపస్ తీసుకున్న రఘురామ

**పెన్ పవర్ డెస్క్:**ఏపీ మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ కు సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. ఆయనపై టీడీపీ లీడర్ రఘురామకృష్ణరాజు దాఖలు చేసిన పిటిషన్లను అత్యున్నత న్యాయ స్థానం తోసిపుచ్చింది. జగన్ బెయిల్ రద్దు చేయాలన్న పిటిషన్ పై ప్రత్యేకంగా విచారణ అక్కర్లేదని కోర్టు అభిప్రాయపడింది. ఈమేరకు సోమవారం జస్టిస్ నాగరత్న, జస్టిస్ సతీశ్ చంద్ర మిశ్రాల ధర్మాసనం తీర్పు చెప్పింది. జగన్ అక్రమాస్తుల కేసును తెలంగాణ హైకోర్టు విచారిస్తోందని

వివరాలు 2లో..




## అమరావతిలో ఏసీఏ బిగ్ ప్లాన్.. రూ.800 కోట్ల రూపాయలతో దేశంలోనే అతి పెద్ద క్రికెట్ స్టేడియం

**పెన్ పవర్ డెస్క్:** దేశంలోనే అతి పెద్ద క్రికెట్ స్టేడియం నిర్మించేందుకు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) ప్రణాళికలు సిద్ధం చేసింది. 1.25 లక్షల మంది ప్రేక్షకులు కూర్చునే సీటింగ్ కెపాసిటితో ఈ స్టేడియం తయారు కానున్నట్టు సమాచారం. అత్యంత గ్రాండ్ గా ఈ స్టేడియం నిర్మించాలని చూస్తుంది. ఈ స్టేడియానికి రూ.800 కోట్ల రూపాయలు ఖర్చు చేయనున్నట్టు వార్తలు వస్తున్నాయి. అదే జరిగితే అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంను దాటి నెంబర్ వన్ క్రికెట్ స్టేడియం అవ్వడం గ్యారంటీ. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు కోసం రాష్ట్ర ప్రభుత్వం నుంచి అమరావతిలో 60 ఎకరాల భూమిని కోరినట్లు ఏసీఏ అధ్యక్షుడు, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ప్రకటించారు. మీడియాతో ఇటీవల జరిగిన



వివరాలు 2లో..

## గద్దర్‌ను హత్య చేశారు.. అన్ని ఆధారాలున్నాయ్



**పెన్ పవర్ డెస్క్:** ప్రజా యుద్ధనౌక గద్దర్ మరణంపై ప్రజా శాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రజా శాంతి పార్టీలో చేరిన గద్దర్‌ను కొందరు హత్య చేశారని.. గద్దర్ హత్యకు గురయ్యారనడానికి మా వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయని కీలక వ్యాఖ్యలు చేశారు. గద్దర్ మరణంపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కేఏ పాల్ సోమవారం (జనవరి 27) నిర్మల్ జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రధాని మోడీ, సీఎం రేవంత్ రెడ్డిలపై నిప్పులు చెరిగారు. రేవంత్ రెడ్డి గద్దెనెక్కి 13 నెలలైనా ఎలాంటి అభివృద్ధి చేయలేదని..

వివరాలు 2లో..

## మోడీ, అమిత్ షా కచ్చితంగా నరకానికే పోతారు



**పెన్ పవర్ డెస్క్:**పుష్కరాల్లో భాగంగా గంగ త్రివేణి సంగమంలో స్నానాలు చేస్తే దేశంలోని పేదరికం అంతం అవుతుందా అంటూ బీజేపీ నేతలను సూటిగా ప్రశ్నించారు ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, యూపీ సీఎం యోగి ఆదిత్య నాథ్ కుంభమేళాలో పవిత్ర స్నానమాచరించడానికి కౌంటర్ గా ఖర్గే విమర్శలు గుప్పించారు. సోమవారం (జనవరి 27) మధ్యప్రదేశ్‌లోని మోవ్‌లో 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్' ర్యాలీలో పాల్గొని ఖర్గే మాట్లాడారు. దేశంలో పిల్లల ఆకలి చావులు, నిరుద్యోగం, పేదరికం వంటి సమస్యలు తీవ్రంగా వేధిస్తోంటే.. అధికారంలోని బీజేపీ నేతలు వాటిపై దృష్టి సారించకుండా.. కుంభమేళాలో స్నానాలు చేయడానికి పోటీలు పడుతున్నారని దుయ్యబట్టారు. గంగ

వివరాలు 2లో..

## ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు మార్గదర్శకాలు జారీ చేసిన ఏపీ ప్రభుత్వం

- అందరికీ ఇళ్లు పథకంపై ఏపీ ప్రభుత్వం మార్గదర్శకాలు
- ఉత్తర్వులు జారీ చేసిన రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి
- రెవెన్యూ మంత్రి చైర్మన్ గా ఏర్పాటైన కమిటీ ఆధ్వర్యంలో పర్యవేక్షణ
- కమిటీలో సభ్యులుగా పురపాలక, గృహ నిర్మాణ శాఖ మంత్రులు, అధికారులు

**పెన్ పవర్ డెస్క్:** 'అందరికీ ఇళ్లు' పథకంలో భాగంగా పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చే అంశంపై ఏపీ ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నేడు ఉత్తర్వులు జారీ చేశారు. అందరికీ ఇళ్లు పథకంలో భాగంగా గ్రామాల్లోని పేదలకు 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లోని పేదలకు 2 సెంట్లు స్థలం ఇవ్వనున్నారు. ఇళ్ల స్థలాలకు ప్రభుత్వం కన్వేయన్స్ డీడ్ ఇస్తుందని ఉత్తర్వుల్లో తెలిపారు. పదేళ్ల కాల పరిమితితో ఫ్రీ హోల్డ్ హక్కులు కల్పించేలా కన్వేయన్స్ డీడ్ ఇవ్వనున్నట్టు వివరించారు. జీవితకాలంలో ఒకసారే ఉచిత ఇంటిపట్టా


వివరాలు 2లో..



## ఆర్టీసీ సమ్మె నోటీస్

**ఆ రోజు నుంచి బంద్ అంటూ అల్టిమేటం**

- ఇచ్చిన హామీలు అమలు చేయాలన్న జేఏసీ
- ఉద్యోగుల విలీనం, రెండు పీఆర్సీలు అమలు చేయాలని నోటీసులు ఇవ్వాలని నిర్ణయం
- బస్ భవన్ కార్యాలయానికి చేరుకున్న కార్మిక సంఘ నాయకులు




**పెన్ పవర్ డెస్క్:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ ఆర్టీసీ)లో మరోసారి సమ్మె సైరన్ మోగింది. సమస్యల పరిష్కారం కోసం ఆర్టీసీ ఉద్యోగులు సమ్మె బాట పట్టేందుకు సిద్ధమయ్యారు. ఈ మేరకు ప్రభుత్వానికి సమ్మె నోటీసు అందజేశారు ఆర్టీసీ ఎంప్లాయిస్. ఆర్టీసీ క్రాస్ రోడ్‌లోని బస్ భవన్లో ఆర్టీసీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, పెండింగ్ సమస్యలు

వివరాలు 2లో..

## ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల్లో ప్రజల అభిప్రాయాలపై సీఎం చంద్రబాబు సమీక్ష



**పెన్ పవర్ డెస్క్:**దావోస్ లో వాణిజ్య పర్యటన ముగించుకుని వచ్చిన సీఎం చంద్రబాబు మళ్లీ పరిపాలనలో నిమగ్నమయ్యారు. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలపై ప్రజల అభిప్రాయం ఎలా ఉందన్న దానిపై తాజాగా సమీక్ష నిర్వహించారు. లబ్ధిదారుల నుంచి సేకరించిన వివరాల మేరకు ఆయా శాఖల పనితీరుపై ఈ సమీక్షలో చర్చించారు. 10 అంశాలను ప్రాతిపదికగా తీసుకుని ఐవీఆర్ఎస్, వివిధ రూపాల్లో అభిప్రాయాలు సేకరించారు. సామాజిక పెన్షన్లు, దీపం పథకం, అన్న క్యాంటీన్, ఉచిత ఇసుక సరఫరా, ధాన్యం సేకరణ, ఆసుపత్రులు, దేవాలయాల్లో సేవలపై వివిధ రూపాల్లో సేకరించిన

వివరాలు 2లో..

- ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల నుంచి అభిప్రాయసేకరణ
- 10 అంశాల ప్రాతిపదికన ఐవీఆర్ఎస్, వివిధ రూపాల్లు సర్వే
- అవినీతిపైనా సర్వేలో ఫిర్యాదులు

## ఎడిటర్ వ్యూ

# ఉచితాలపై మళ్లీ చర్చ...

ప్రభుత్వాలు, సంస్థలు ప్రజలకు ప్రాథమిక అవసరాలు, సహాయం లేదా ప్రోత్సాహాన్ని అందించేందుకు ఉచిత పథకాలను ప్రవేశపెడతాయి. ఈ పథకాలు సాధారణంగా ప్రజల సంక్షేమం, ఆరోగ్యం, విద్య, పౌర సేవలు, ఇతర అవసరాలను తీర్చేందుకు రూపొందించబడతాయి. ఉచిత పథకాలు సాధారణంగా సాయపడేవిగా అనిపించినప్పటికీ, వాటి ప్రయోజనాలు, దుష్ప్రభావాలను బట్టి వాటి ప్రయోజనాలు మేలు చేసే విధానం కూడా మారుతుంది. ఉచిత పథకాలు ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వా?వలు రూపొందిస్తున్నాయి. అమలు చేస్తున్నాయి. ఉచిత ఆరోగ్య సేవలు, ఉచిత విద్య, నిత్యావసరాల రేట్లలో తగ్గింపులు, గడచిన బడ్జెట్ ప్రకటనల్లో అన్నిటికి బాగా ఉపయోగపడే పథకాలు. వీటి ద్వారా చాలా మంది పేదరికంలో ఉన్న వారు లేదా ఆర్థికంగా బలహీనంగా ఉన్న వారు తమ జీవన విధానాలను మెరుగుపరచుకునే అవకాశాన్ని పొందుతారు. కొన్ని ఉచిత పథకాలు ప్రజలకు ప్రాథమిక సేవలను అందించేందుకు విస్తృతంగా ఉపయోగపడతాయి. ఉదాహరణకు, ఉచిత విద్య, ఆరోగ్య బీమాలు, ఉచిత సాంకేతిక శిక్షణ తదితర పథకాలు, ఆర్థికంగా అశక్తులైన వారి కోసం అవి పెద్ద ఉపకారం అవుతాయి. ఇవి అనేక పేద కుటుంబాలకు, అనాథలకు, నిరుపేదలకు, వృద్ధులకు మరియు దివ్యాంగులకు అవకాశం కల్పిస్తాయి. ఉచిత పథకాలు సమాజంలోని అన్ని వర్గాల మధ్య సమానత్వాన్ని పెంపొందిస్తాయి. ప్రాథమిక సేవలు అందించడం ద్వారా, ప్రతి ఒక్కరూ స్థాయి పరిస్థితులలో ఉంటారు. ఉదాహరణగా, ఉచిత విద్య ద్వారా అన్ని వయసుల పిల్లలు సమాన అవకాశాలను పొందవచ్చు. ఉచిత పథకాలు తీసుకుంటున్నప్పుడు కొంత మంది వారు నిజంగా అర్హులు కాని వారు కూడా పొందవచ్చు. ఈ విధంగా, రుణాలపై మరియు బడ్జెట్ పై అప్రతిష్టమైన ఒత్తిడి ఉంటుంది. కొన్ని సందర్భాలలో, కొన్ని పథకాలు ప్రజలపై అధిక భారం నింపవచ్చు, లేదా కొంతమంది దుర్వినియోగం చేసుకోవచ్చు. ఉచిత సేవలు, సదా పబ్లిక్ సేవలు, అవి నాణ్యత కలిగి ఉండకపోవచ్చు. వీటిలో కేవలం మూల్యము లేకపోవడం వల్ల, సేవల నాణ్యత తగ్గిపోవచ్చు. ఎప్పుడు డిమాండ్ అధికంగా ఉన్నప్పుడు, అందుబాటులోకి వచ్చే సేవలు కూడా బాగా నిర్వహించకపోవచ్చుప్రభుత్వం ప్రజలకు ఉచిత పథకాలను అందిస్తే, ఆ ఆర్థిక భారాన్ని ప్రభుత్వాలపై పడుతుంది. ఈ పథకాలు దీర్ఘకాలంలో ప్రభుత్వ ఖజానాను తీవ్రంగా ప్రభావితం చేయవచ్చు, మరియు పన్నులు పెంచే అవసరం రావచ్చు. అంటే, ఒకవేళ ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న ఉచిత పథకాలు అనేక ఖర్చులను పెంచినప్పుడు, ఇది మొత్తం దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయవచ్చు. ఉచిత పథకాలు కొన్ని సందర్భాల్లో ప్రజలలో స్వీయ ప్రయోజనాన్ని తగ్గించవచ్చు. ఎవరైనా ఉచితంగా సేవలను పొందినప్పుడు, వారు ఆ సేవలకు బదులు మరొకటి ప్రయత్నించే ప్రయత్నం చేయకపోవచ్చు, ఇది వ్యక్తిగత ప్రగతి మరియు స్వయం సహాయాన్ని నెరవేర్చడం కోసం తగిన ప్రేరణ లేకుండా చేస్తుంది. ఉచిత పథకాలు ప్రజలకు ఉపయోగపడే మార్గాల్లో ఎంతో శక్తివంతంగా ఉండవచ్చు, కానీ అవి సరైన రీతిలో, సక్రమంగా, క్రమంగా అమలు చేయబడాలి. ఎప్పటికప్పుడు ఉచిత సేవలను అందించడం కాదు, అవి కచ్చితమైన అర్హతలకు మాత్రమే అందాలని, మరియు అవి నాణ్యతతో కూడిన సేవలు కావాలని నిర్ధారించుకోవాలి. ఉచిత పథకాలు, చాలా సందర్భాల్లో, ప్రజల జీవితాలను మెరుగుపరచడం కోసం ఎంతో కీలకమైనవి. అయితే, వీటి అమలులో కొన్ని సవాళ్లు, నాణ్యత సమస్యలు, ఆర్థిక భారాలు ఉండవచ్చు. అవి పేదరికం నుంచి?విముక్తి పొందడంలో సహాయపడగలవు, కానీ వాడుకదారులు అర్హత ఉండే వారికి మాత్రమే ఈ సేవలు అందిపుచ్చుకోవడం సమంజసం. మరో వైపు ఎంతకాలం ఉచిత పథకాలు ఇస్తూ పోతారు...ఉపాధి కల్పించలేరా?" అని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. కరోనా దగ్గర నుంచి వలస కార్మికులకు ఉచిత రేషన్ ఇస్తుండడాన్ని గుర్తు చేస్తూ వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించి, నైపుణ్యాలపై శిక్షణ ఇవ్వాల్సి ఉందని తెలిపింది. జాతీయ ఆహార భద్రత చట్టం-2013 కింద 81 కోట్ల మందికి ఉచితంగాగానీ, రాయతీపైనగానీ రేషన్ పంపిణీ చేస్తున్నామని కేంద్ర ప్రభుత్వం చెప్పగా ఆశ్చర్యం వ్యక్తం చేసింది. "పన్ను చెల్లింపుదార్లనే విడిచిపెట్టారన్న మాట!" అని వ్యాఖ్యానించింది. కరోనా సమయంలో వలస కార్మికుల సమస్యలపై సుమోటోగా చేపట్టిన వ్యాజ్యంపై సోమవారం ధర్మాసనం విచారణ జరిపింది. ఓ స్వచ్ఛంద సంస్థ తరఫున న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపిస్తూ కరోనా సమయంలో 'ఈ-శ్రమ్' పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకున్న వలస కార్మికులకు కూడా ఉచితంగా రేషన్ ఇచ్చారని, దాన్ని కొనసాగించాలని కోరారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ ఎంతకాలం ఉచితాలు కొనసాగిస్తారు...ఉపాధి ఎందుకు కల్పించరని కేంద్రాన్ని ప్రశ్నించింది. ప్రభుత్వ ఆదాయంలో సగభాగం ఉచిత తాయిలాలకు మిగిలిన సగభాగం ఉద్యోగుల జీతాలకు పోతున్నది. అటువంటప్పుడు అభివృద్ధి జరిగే అవకాశం ఎక్కడ ఉంటుంది. అభివృద్ధికి సంక్షేమానికి తారతమ్యం లేకుండా పోతూ ఉంది. ప్రజలు గతంలో సమష్టి ప్రయోజనాల కోసం నాయకులను డిమాండ్ చేసే వారు. అది కాలక్రమేణా వ్యక్తిగత ప్రయోజనాల వైపు మరలిపోయింది. దీనిని గ్రహించిన నాయకులు అదే దిశగా ప్రయాణం చేసి ప్రజలను వ్యక్తిగతంగా సంతృప్తి పరచడంలో తలమునకలవుతున్నారు. అయితే ఇవన్నీ ఉపశమనాలు తప్ప శాశ్వత పరిష్కారం కాదని నాయకులకు తెలుసు.
శాశ్వత పరిష్కారానికి దీర్ఘకాలిక లక్ష్యాలు ఉండాలి. అవి లేకపోతే ఎప్పటికీ పేదరికం అంతం కాదు. అయితే ఆర్థిక అసమానతలు అసాధారణంగా పెరుగుతున్న మన ఎగుడుదిగుడు సమాజంలో అట్టడుగు నుంచే బడుగు, బలహీన వర్గాలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే. పైగా, మనది సంక్షేమ రాజ్యమని రాజ్యాంగంలో రాసుకున్నాం. అభివృద్ధిలో వారినీ భాగస్వాముల్ని చేసేలా సమ్మిళిత ప్రగతి అవసరం. అందుకై చేపట్టే సంక్షేమ కార్యక్రమాల పట్ల ఎవరికీ అభ్యంతరం ఉండదు. కానీ, ఆ ముసుగులో యోగ్యతలు, అర్హతలతో నిమిత్తం లేకుండా అమలు చేసే పథకాలు అమలు ఎప్పటికీ సమర్థనీయం కాదు. సమష్టి ప్రయోజనాలు కోసం చేపట్టే ఉచిత పథకాలు అన్నీ ఉత్పాదకమైన విగానే భావించాలి.

# రోజాకు దావోస్ కు, జ్యూరిచ్ కు తేడా తెలియదు

- మొదటి పేజీ తరువాయి
ఓ వ్యక్తి అడిగిన ప్రశ్నకు సమాధానంగా రెడ్ బుక్ గురించి మాట్లాడాను... రెడ్ బుక్ గురించి దావోస్ లో మాట్లాడలేదు.... ఆ విషయం వైసీపీ నేతలు గ్రహించాలి... అయినా రెడ్ బుక్ గురించి ఎందుకు వారికంత భయం? అని లోకేశ్ ప్రశ్నించారు. "ఒక్కో పారిశ్రామికవేత్తను ఒప్పించడానికి కష్టపడాల్సి వస్తోంది. కాగ్నిజెంట్‌ను వారి పెవిలియన్‌కు వెళ్లి కలిశాను. మన పిల్లల కోసం వెళ్లాను. త్వరలోనే విశాఖ, ఉత్తరాంధ్రకు గుడ్ న్యూస్ వస్తుంది" అని వివరించారు. ఈసారి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉండకూడదనుకుంటున్నానన్న తెలుగుదేశం పార్టీ కార్యకర్తగానే చూడండి. చంద్రబాబు గారు ఏ బాధ్యతలు ఇచ్చినా అహర్నిశలు కష్టపడి పనిచేస్తా. పార్టీని బలోపేతం చేస్తా. పార్టీకి చెడ్డపేరు మాత్రం తీసుకురాను. పాదయాత్ర చేశాను. పార్టీ ఏ బాధ్యత ఇచ్చినా క్రమశిక్షణతో పనిచేస్తా. ఒక వ్యక్తి మూడుసార్లు కంటే ఒక పదవిలో ఉండకూడదనేది నా వ్యక్తిగత అభిప్రాయం. నేను కూడా ఈసారి జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉండకూడదని భావిస్తున్నా. గ్రామపార్టీ నుంచి పొలిట్ బ్యూరో వరకు పార్టీలో చైతన్యం రావాల్సి ఉంది. దీనిపై పార్టీ పెద్దలు నిర్ణయిస్తారు... అని లోకేశ్ స్పష్టం చేశారు.

# మోడీ, అమిత్ షా కచ్చితంగా నరకానికే పోతారు

- మొదటి పేజీ తరువాయి
నదిలో మునిగితే దేశంలోని పేదరికం అంతం అవుతుందా..? నిరుద్యోగం తగ్గుతుందా..? పిల్లల ఆకలి చావులు ఆగుతాయా..? అంటూ బీజేపీ నేతలపై ప్రశ్నల వర్షం కురిపించారు ఖర్గే. కేవలం ఫొటోలు, మీడియాలో కనిపించడం కోసమే బీజేపీ నేతలు పోటీ పడుతున్నారని విమర్శించారు. ప్రధాని మోడీ, అమిత్ షా చాలా తప్పులు చేశారు.. వారు ఎక్కడికెళ్లిన మోక్షం లేదు.. వాళ్లిద్దరూ కచ్చితంగా నరకానికే వెళ్తారని ఖర్గే వివాదస్పద వ్యాఖ్యలు చేశారు. "నేను ఎవరి విశ్వాసాన్ని దెబ్బ తీయకూడదనుకుంటున్నాను. నా మాటలు ఎవరినైనా నొప్పించి ఉంటే క్షమించండి. కానీ గంగాలో స్నానమాచరించడం వల్ల పేదరికం తొలగిపోతుందా..? పేదలకు అన్నం దొరుకుతుందా..? దేశంలో ఎంతో మంది పేదల పిల్లలు బడికి వెళ్లలేక ఆకలితో చనిపోతున్నారు. కార్మికులకు జీతాలు అందడం లేదు. కానీ టీవీల్లో మంచిగా కనిపించడం కోసం బీజేపీ నేతలు గంగా నదిలో మునిగేందుకు పోటీ పడుతున్నారు" అని విమర్శలు వర్షం కురిపించారు. మతం పేరుతో బీజేపీ చేస్తోన్న దోపిడికి కాంగ్రెస్ వ్యతిరేకమని అన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ తో దేశానికి ప్రమాదమని హాట్ కామెంట్స్ చేశారు.
మల్లికార్జున వ్యాఖ్యలపై బీజేపీ వెంటనే రియాక్ట్ అయ్యింది. ఖర్గే వ్యాఖ్యలకు ధీటుగా బదులిచ్చారు బీజేపీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర.
ఖర్గే హిందువులను లక్ష్యంగా చేసుకున్నారని.. కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ స్క్రిప్ట్‌ను ఆయన చదివారని కౌంటర్ ఇచ్చారు. ఖర్గే వ్యాఖ్యలు సనాతన ధర్మంపై దాడి అని విమర్శించారు. హిందు మతాన్ని కించపర్చడం కాంగ్రెస్ నేతలకు అలవాటుగా మారిందని ధ్వజమెత్తిన సంబిత్ పాత్ర.. మరేదైనా మతం గురించి ఖర్గే ఇలాంటి మాటలు మాట్లాడగలరా..? అని ప్రశ్నించారు. ఖర్గే వ్యాఖ్యలు ఖండించదగినవని.. ఆయన కామెంట్స్ పై కాంగ్రెస్ వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# జగన్ కు సుప్రీంకోర్టులో ఊరట

- మొదటి పేజీ తరువాయి
సుప్రీం గుర్తుచేసింది. ఈ నేపథ్యంలో బెయిల్ రద్దు కోసం ప్రత్యేకంగా విచారణ అక్కర్లేదని తెలిపింది. ఎమ్మెల్యే, ఎంపీల కేసుల విషయంలో గతంలో ఇచ్చిన తీర్పు ఈ కేసుకూ వర్తిస్తుందని పేర్కొంది. ట్రయల్ కోర్టు రోజువారీ విచారణ జరపాలని, హైకోర్టు కూడా పర్యవేక్షించాలని సూచించింది. అదే సమయంలో ఈ కేసును మరో రాష్ట్రానికి బదిలీ చేయాల్సిన అవసరం కూడా లేదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. దీంతో తమ పిటిషన్ ను ఉపసంహరించుకునేందుకు అనుమతించాలని రఘురామ తరఫు లాయర్ కోరగా.. ధర్మాసనం అందుకు అంగీకరించింది.

# గద్దర్‌ను హత్య చేశారు.. అన్ని ఆధారాలున్నాయ్

- మొదటి పేజీ తరువాయి
ప్రధాని మోడీ హయాంలో భారతదేశం అభివృద్ధి పాతాళంలోకి వెళ్లిపోయిందని విమర్శలు చేశారు.
నిర్మల్ ను జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేసిన ఇక్కడ కనీసం మండల స్థాయి అభివృద్ధి జరగలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాటలను ప్రజలేవరు నమ్మే పరిస్థితి లేదని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ హయాంలో సర్పంచ్ లు అప్పుల పాలయ్యారని విమర్శించారు. అందుకే పాలన్న రావాలి.. పాలన మారాలి అనే నినాదంతో ప్రజల్లోకి వెళ్తున్నామని స్పష్టం చేశారు. రాబోయే సర్పంచ్ ఎన్నికల్లో ప్రజాశాంతి పార్టీ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా శాంతి పార్టీ అభ్యర్థులు గెలిచిన గ్రామాల్లో వంద రోజుల్లోనే ఉచిత విద్య, వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు కేఏ పాల్. అలాగే.. మా పార్టీ గెలిచిన గ్రామాల్లో నిరుద్యోగులందరికి ఉద్యోగం కల్పించి చూపిస్తామన్నారు.
గద్దర్‌కు పద్మ పురస్కారం ఇవ్వకపోవడంపై వివాదం నడుస్తోన్న విషయం తెలిసిందే. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన గద్దర్‌కు పద్మ అవార్డు ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. తెలంగాణ ప్రభుత్వ ప్రతిపాదనను మోడీ సర్కార్ తోసిపుచ్చింది. గద్దర్‌కు పద్మ అవార్డు ఇచ్చేందుకు నిరాకరించింది కేంద్ర ప్రభుత్వం. గద్దర్‌కు ప్రతిష్టాత్మక పద్మ పురస్కారం దక్కకపోవడంపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేశారు. పద్మ పురస్కారాల్లో కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు అన్యాయం చేసిందని అన్నారు. గద్దర్ కు పద్మ అవార్డు ఇవ్వకుండా యావత్ తెలంగాణ ఉద్యమకారులను కేంద్ర ప్రభుత్వం అవమానించిందన్నారు. ఈ తరుణంలో గద్దర్ మరణంపై కేఏ పాల్ చేసిన 'మర్డర్' వ్యాఖ్యలు స్టేట్ పాలిటిక్స్ లో హాట్ టాపిక్ గా మారాయి. గద్దర్ హత్యకు గురి అయ్యారనడానికి కేఏ పాల్ వద్ద ఉన్న సాక్ష్యాలేంటి అనే దానిపై చర్చలు మొదలయ్యాయి.

# అమరావతిలో ఏసీఏ బిగ్ ప్లాన్..
## రూ.800 కోట్ల రూపాయలతో దేశంలోనే అతి పెద్ద క్రికెట్ స్టేడియం

- మొదటి పేజీ తరువాయి
ఇంటరాక్షన్‌లో, అమరావతిలో 200 ఎకరాల్లో ప్లాన్ చేసిన పెద్ద స్పోర్ట్స్ సిటీలో ఈ ప్రాజెక్ట్ భాగమని చిన్ని తెలిపారు. ఇందుకు గాను బోర్డ్ ఆఫ్ కంట్రోల్ ఫర్ క్రికెట్ ఇన్ ఇండియా (బీసీసీఐ) నుండి ఆర్థిక సహాయం కోరబడుతుంది.
"ఈ స్టేడియం దేశంలో క్రికెట్ మౌలిక సదుపాయాలను పునర్నిర్వచించడమే కాకుండా అమరావతిని ప్రపంచ క్రీడా పటంలో ఉంచుతుంది" అని కేశినేని శివనాథ్ చెప్పుకొచ్చారు. స్టేడియంతో పాటు 2029 జాతీయ క్రీడలను అమరావతిలో నిర్వహించేందుకు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ప్రణాళికలు యోచిస్తోంది. ఉత్తర కోస్తా ఏపీ, విజయవాడ, రాయలసీమలో మూడు ప్రత్యేక క్రికెట్ అకాడమీలను ఏర్పాటు చేయనున్నట్లు శివనాథ్ వెల్లడించారు. భారత మాజీ క్రికెటర్లు మిథాలీ రాజ్, రాబిన్ సింగ్ ఈ అకాడమీలలో శిక్షణను పర్యవేక్షిస్తారు.

# ఆర్టీసీ సమ్మె నోటీస్
## ఆ రోజు నుంచి బంద్ అంటూ అల్టిమేటం

- మొదటి పేజీ తరువాయి
పరిష్కారించాలంటూ సోమవారం (జనవరి 27) ఆర్టీసీ జేఏసీ నేతలు టీజీఎస్ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ కు సమ్మె నోటీసు ఇచ్చారు. మొత్తం 21 డిమాండ్లను ప్రభుత్వం ముందు పెట్టారు ఆర్టీసీ ఉద్యోగులు. తమ సమస్యలు పరిష్కరించకపోతే 2025, ఫిబ్రవరి 9న సమ్మె బాట పడతామని ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేశారు. సమ్మె నోటీసు అందజేత సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగులు, కార్మిక జేఏసీ నేతలు పెద్ద ఎత్తున బస్ భవన్ కు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీ నేతలు మాట్లాడుతూ.. నెలల పాటు పెండింగ్లో ఉన్న తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మొత్తం 21 డిమాండ్లతో ప్రభుత్వానికి సమ్మె నోటీసు అందజేశామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలైన ఉద్యోగుల సమస్యల్ని పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో చెప్పినట్లుగా తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.
ఎలక్ట్రిక్ బస్సుల పేరుతో డిపోలను ప్రభుత్వం ప్రైవేటు సంస్థల చేతుల్లో పెడుతుందని.. ప్రైవేటు కంపెనీల ద్వారా ఎలక్ట్రిక్ బస్సులను తీసుకురావడం వల్ల తమ ఉద్యోగాలు కోల్పోయే అవకాశం ఉందని ఆందోళనను వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు ప్రభుత్వంలో విలీనం, 2021 పీఆర్సీ, 2017 వేతన పెండింగ్ బకాయిల సమస్యలు పరిష్కరించలేదని.. ప్రభుత్వం వాటిపై దృష్టి సారించి వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీ ఉద్యోగులు మరోసారి రోడ్డెక్కేందుకు సిద్ధమవడంతో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి మరీ.

# గద్దర్ ఒక మాజీ నక్సలైట్.. ఆయనకు పద్మ అవార్డ్ ఎలా ఇస్తారు..?

- మొదటి పేజీ తరువాయి
బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ నక్సలైట్ కాదన్నారు. మావోయిస్టు భావజాలం వేరు.. నక్సలైట్ గా పని చేయడం వేరని పేర్కొన్నారు. నక్సలిజంతో ఎంపీ ఈటల రాజేందర్ కు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. అలాగే.. నంది అవార్డుల స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలనుకుంటున్న గద్దర్ అవార్డులు మా వాళ్ళు తీసుకోరని బండి సంజయ్ స్పష్టం చేశారు. గద్దర్ కాంగ్రెస్, టీడీపీకి చెందిన నేతలను హతమార్చారని.. ఆ విషయం సీఎం రేవంత్ రెడ్డికి తెల్వదని అన్నారు. గద్దర్ కు వ్యతిరేకంగా మాట్లాడానని.. నా దిష్టి బొమ్మ తగలబెడితే నా ఆయుష్షే పెరుగుతుందని సెటైర్ వేశారు కేంద్రమంత్రి బండి సంజయ్.

# ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు మార్గదర్శకాలు జారీ చేసిన ఏపీ ప్రభుత్వం

- మొదటి పేజీ తరువాయి
ఇచ్చేలా విధివిధానాలకు రూపకల్పన చేశారు. ఇంటిపట్టా ఇచ్చిన రెండేళ్ల లోగా నిర్మాణం చేపట్టాల్సి ఉంటుందని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకే ఉచిత ఇంటిస్థలం కేటాయిస్తారని పేర్కొన్నారు. లబ్ధిదారులకు రాష్ట్రంలో ఇంకెక్కడా ఇంటిస్థలం, సొంత ఇల్లు ఉండకూడదని స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర గృహనిర్మాణ పథకాల్లో లబ్ధిదారులుగా ఉండరాదని తెలిపారు.
రెవెన్యూ మంత్రి చైర్మన్‌గా ఏర్పాటైన కమిటీ ఈ అందరికీ ఇళు పథకాన్ని పర్యవేక్షిస్తుందని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పురపాలక, హౌసింగ్ శాఖ మంత్రులు, ఉన్నతాధికారులు ఈ కమిటీలో సభ్యులుగా వ్యవహరిస్తారని వివరించారు. వివిధ శాఖల మధ్య సమన్వయానికి అధికారుల కమిటీని కూడా నియమిస్తున్నట్టు ఉత్తర్వుల్లో వెల్లడించారు.

# సైఫ్ అలీఖాన్‌పై దాడి కేసులో పశ్చిమ బెంగాల్ మహిళ అరెస్ట్

- నిందితుడు వినియోగించిన సిమ్ కార్డు ఈ మహిళ పేరుతో ఉన్నట్లు గుర్తింపు
- బెంగాల్‌లోని నదియా జిల్లా చప్రాకు చెందిన మహిళగా గుర్తించిన పోలీసులు
- భారత్‌లోకి చొరబడినప్పటి నుంచి మహిళతో నిందితుడు టచ్‌లో ఉన్నాడని వెల్లడి

పెన్ పవర్ డెస్క్:బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌పై అతని ఇంట్లో కత్తితో దాడి జరిగిన కేసులో ముంబై పోలీసులు ఓ మహిళను అరెస్ట్ చేశారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన మహిళను పోలీసులు అరెస్ట్ చేశారు. సైఫ్ అలీఖాన్‌పై దాడికి పాల్పడిన నిందితుడు వినియోగించిన సిమ్ కార్డు ఈ మహిళ పేరుతో ఉన్నట్లుగా పోలీసులు గుర్తించారు. నదియా జిల్లా చప్రాకు చెందిన మహిళగా గుర్తించామని పశ్చిమ బెంగాల్ పోలీసులు తెలిపారు. ఈ కేసులోని నిందితుడితో ఈమెకు పరిచయం ఉన్నట్లుగా గుర్తించినట్లు చెప్పారు. బంగ్లాదేశ్ నుంచి భారత్‌లోకి అక్రమంగా ప్రవేశించాడని, అప్పటి నుంచి మహిళతో టచ్‌లో ఉంటున్నాడని చెప్పారు. దర్యాప్తులో భాగంగా ముంబై నుంచి వచ్చిన పోలీసులు ఆమెను అరెస్ట్ చేశారని వెల్లడించారు.

# ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల్లో ప్రజల అభిప్రాయాలపై సీఎం చంద్రబాబు సమీక్ష

- మొదటి పేజీ తరువాయి
సమాచారాన్ని నేటి సమావేశంలో సమీక్షించారు. పెన్షన్ల పంపిణీపై 90.2 శాతం మంది లబ్ధిదారులు సంతృప్తి వ్యక్తం చేసినట్టు ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా గుర్తించారు. ధాన్యం సేకరణలో 89.92 శాతం మంది రైతులు సంతృప్తి చెందినట్టు వెల్లడైంది. దేవాలయాల్లో దర్శనాలపై 70 శాతం మంది భక్తులు సంతృప్తి వ్యక్తం చేయగా... ఆసుపత్రుల్లో డాక్టర్లు, సిబ్బంది సేవలపై 35 శాతం ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేసినట్టు గుర్తించారు. ఇక... వివిధ పథకాల్లో ఉద్యోగుల నిర్లక్ష్యం, అవినీతిపై సర్వేల్లో ఫిర్యాదులు వచ్చాయి.

# ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నమోదయ్యే అర్జీలను పరిష్కరించడంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ సారించాలి

## జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి







**పెన్ పవర్ బ్యూరో బాపట్ల జనవరి 27:**

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ సోమవారం స్థానిక కలెక్టరేట్ లో నిర్వహించారు. మా సమస్యలు పరిష్కరించండంటూ బాధితులు అర్జీల ద్వారా జిల్లా కలెక్టర్ కి విన్నవించారు. వినతిపత్రాలను పరిశీలించిన కలెక్టర్ కొన్నింటికి అక్కడికక్కడే పరిష్కార మార్గం చూపారు. పీజీఆర్ఎస్ లో 121 అర్జీలు నమోదు అయ్యాయి. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు అధికారులు నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. రెవెన్యూ సదస్సు, సర్వే గ్రామ సభలలో వచ్చిన అర్జీలలో 3400 అర్జీలు ఆడిటింగ్ కు ఉన్నాయన్నారు. వాటిని పరిశీలించి 100% పరిష్కరించాలని అన్నారు. నిజాంపట్నం, మార్టూరు, కారంచేడు, జె పంగులూరు, భట్టిప్రోలు, చీరాల మండలాలలో అర్జీలు సక్రమంగా ఆడిటింగ్ జరగడంలేదన్నారు.వాటిని పరిష్కరించకపోవడం పై ఆయన ఆరా తీశారు. పెండింగ్ అర్జీలపై పూర్తిస్థాయిలో ఆడిట్ చేయాలని, గడువులోగా పరిష్కరించాలని వీక్షణ సమావేశం ద్వారా మండల అధికారులను ఆదేశించారు. బాపట్ల, రేపల్లె, చీరాల రెవెన్యూ డివిజన్ పరిధిలో అర్జీల పరిష్కారం పై ఒక టీం ని ఏర్పాటు చేసుకోవాలని ఆర్డీవో లను ఆదేశించారు. ఆయా శాఖలలో పెండింగ్ లో ఉన్న అర్జీలను వెనువెంటనే పరిష్కరించుటకు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలు, హైటీ కార్యక్రమానికి హాజరుకాని అధికారులపై జిల్లా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. జాతీయ పండుగ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం క్షమార్హులని అన్నారు. అధికారులు స్టాల్స్ ఏర్పాటు చేశారు కానీ అందులో ఆయా శాఖల అధికారులు లేకపోవడం మంచి పద్ధతి కాదని అన్నారు. గణతంత్ర దినోత్సవానికి గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. వేడుకలకు హాజరైన అధికారులను ఆయన అభినందించారు. జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశం ఈనెల 28వ తారీఖున ఉదయం 11 గంటలకు స్థానిక జిల్లా కలెక్టరేట్ లోని వీక్షణ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. అధికారులందరూ ఉదయం 10.30 గంటలకు హాజరుకావాలని తెలిపారు. ఆయా శాఖల జిల్లా అధికారులు నివేదికను, పిపిటి రూపంలో అందజేయాలన్నారు. జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులకు వివరించేటప్పుడు నివేదిక కు, పి పి టి కు తేడా లేకుండా అధికారులను జాగ్రత్త వహించాలన్నారు. మంత్రులు అడిగే ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చేలా సమగ్ర సమాచారంతో అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. బాపట్ల కు 20 సూత్రాల చైర్మన్ లంక దినకర్ ఈనెల 30వ తారీఖున వస్తున్నారని కలెక్టర్ అన్నారు. ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్లో కేంద్ర పథకాల అమలుపై సమీక్ష సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. అందుకు సంబంధించి అధికారులు ఆయా పథకాల అమలు తీరుపై నివేదిక తయారు చేయాలన్నారు. పి పి టి ద్వారా చైర్మన్ కు వివరించాలన్నారు. పథకాల అమలులో జిల్లా ప్రగతిని చూపేలా వివరాలు ఇవ్వాలన్నారు. ముఖ్యమంత్రివర్యులు మూడోదఫా కలెక్టర్ల కాన్ఫరెన్స్ ఫిబ్రవరి రెండో వారంలో జరుగుతుందని అధికార సమాచారం అందినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. గతంలో రెండు కాన్ఫరెన్స్ లలో 36 శాఖల పై రెండు రోజులు పాటు సమీక్ష జరగడం వలన జిల్లాపై పూర్తిగా వివరించే అవకాశం లభించలేదని అన్నారు. ప్రస్తుతం 36 శాఖల సెక్రటరీలు ప్రజెంటేషన్ అంశాలను తయారు చేసి ముందుగా జిల్లా కలెక్టర్లకు అందజేస్తారని అన్నారు. ఈ నేపథ్యంలో సమస్యలు చెప్పుకోవడానికి, జిల్లా గురించి వివరించడానికి అవకాశం కల్పిస్తారని అన్నారు. అభివృద్ధి కార్యక్రమాలు, తీసుకుంటున్న చర్యలతో జిల్లా మొదటి స్థానంలో ఉంచేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. అధికారులు స్పందించకపోతే చర్యలు తీసుకుంటామని తెలిపారు. డేటా తయారు చేసే క్రమంలో సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో చర్చించి లోటుపాట్లు లేకుండా నివేదిక సిద్ధం చేసుకోవాలన్నారు. ఆయా శాఖల అభివృద్ధి పనుల కోసం భూసేకరణ పై రెవెన్యూ డివిజన్ అధికారి,జిల్లా రెవెన్యూ అధికారి మరియు జిల్లా సంయుక్త కలెక్టర్ లతో చర్చించి పరిష్కరించుకోవాలని అన్నారు. విశేష సేవలు అందిస్తున్న రెడ్ క్రాస్ సంస్థలో సభ్యత్వ నమోదును లక్ష్యాలను బాపట్ల, చీరాల మున్సిపల్ కమిషనర్లు చేరుకున్నారని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా బాపట్ల మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డిని జిల్లా కలెక్టర్ శాలువాతో సత్కరించారు. ప్రతి మండలంలో 50 మందికి తగ్గకుండా ఎండిఓలు సభ్యత్వ నమోదు చేయించాలన్నారు. ఇంటింటా సంక్రమించని వ్యాధుల పై ప్రతి మండలంలో, గ్రామాలలోనూ ఎం పీ హెచ్, ఏఎన్ఎంలు సర్వే నిర్వహిస్తున్నారని అన్నారు. అందుకుగాను ఆయా వైద్య సిబ్బందికి ఇతర విధులను కేటాయించకుండా మండల అధికారులు జాగ్రత్త వహించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి డి.గంగాధర్ గౌడ్, రెవెన్యూ డివిజనల్ అధికారి పి గ్లోరియా, రెడ్ క్రాస్ సంస్థ చైర్మన్ నారాయణ బట్టు, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పెన్ పవర్
గుంటూరు । బాపట్ల । పల్నాడు

# సరిగ్గా రెండేళ్ల క్రితం
# యువగళం తొలి అడుగు..

## ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ



**పెన్ పవర్ బ్యూరో బాపట్ల జనవరి 27:**

ప్రపంచ దేశాలు ఆంధ్రప్రదేశ్ వైపు చూసేలా తెలుగుదేశం పార్టీ ప్రతి కార్యకర్త తలెత్తుకొని చేసేలా యువగళం పాదయాత్రతో చరిత్ర సృష్టించిన తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి,ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ,ఎలక్ట్రానిక్స్ -కమ్యూనికేషన్స్,రియల్ టైం గవర్నెన్స్ మంత్రివర్యులు నారా లోకేష్ యువగళం పాదయాత్రకు నేటితో రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా అభినందనలు తెలియజేస్తున్నాను అని బాపట్ల నియోజకవర్గ శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు అన్నారు. ఈ సందర్భంగా బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు మాట్లాడుత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాలలో పెనుమార్పులకు కారణమైన ఈనాటి ప్రజా ప్రభుత్వం ఏర్పడటానికి... జగన్ వైసీపీ పార్టీ తుడిచిపెట్టుకు పోవడానికి సరిగ్గా రెండేళ్ల క్రితం ఇదే రోజున యువగళం తొలి అడుగు పడింది.ఎన్ని ఆటంకాలు ఎదురైనా, ఇబ్బందులు సృష్టించినా, అడ్డుకోవాలని కుట్రలు పన్నినా...జనమే బలమై, బలగమై యువనేత నారా లోకేష్ యువగళం పాదయాత్ర జైత్రయాత్రగా నడిపించారు. చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గం కుప్పంలోని వరదరాజస్వామి దేవస్థానం నుండి యువగళం పాదయాత్ర ప్రారంభమైంది. విశాఖ జిల్లా విశాఖపట్నం, అగనంపూడి లో పూర్తిచేశారు. 3,132 కిలోమీటర్లు, 226 రోజులు ఈ పాదయాత్ర సాగింది. నాటి వైసీపీ పాలకులు యువనేత యువగళం పాదయాత్రను అడ్డుకునేందుకు టీడీపీ నాయకులపై అనేక అక్రమ కేసులు పెట్టినా, రాళ్లు విసిరినా, దాడులు చేసినా అదరక, బెదరక యువగళం పాదయాత్రను ముందుకు తీసుకెళ్లారు. చివరకు కూటమి ఘన విజయానికి కీలకపాత్ర వహించారు. నారా లోకేష్ నేతృత్వంలో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నారా లోకేష్ ఆలోచనలకు యువత పెద్ద ఎత్తున ఆకర్షితులౌతున్నారు. నారా లోకేష్ పాదయాత్రలో ప్రజలు విన్నవించుకున్న సమస్యలను పరిష్కరించేందుకు ఆయన నిరంతరం కృషి చేస్తున్నారు. యువత భవిష్యత్తుకు,రాష్ట్ర అభివృద్ధికి ఆయన అన్ని విధాల పాటుపడుతున్నారు.తండ్రికి తగ్గ తనయుడిలా సీఎం చంద్రబాబు వలే మంత్రి నారా లోకేష్ ప్రతి క్షణం పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు. విద్యా వ్యవస్థలో సమూల మార్పులు చేపట్టి విద్యార్థులను ఉన్నత మార్గంలో నడిపించేందుకు ప్రయత్నిస్తున్నారు. రాష్ట్రాన్ని ఐటీ హబ్ గా మార్చేందుకు ఏఐ టెక్నాలజీకి దేశంలో ఏపీని కేంద్రంగా మార్చేందుకు ఆయన చేస్తున్న కృషి హర్షణీయమని బాపట్ల నియోజకవర్గ శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు కొనియాడారు.

# మానవతా దృక్పథంతో వ్యవహరించిన జిల్లా ఎస్పీ తుషార్ డూడి

### నడవలేని స్థితిలో విల్ చైర్ లో వచ్చిన అర్జీ దారుడి వద్దకే వెళ్ళి సమస్యను అడిగి తెలుసుకొన్న ఎస్పీ





**పెన్ పవర్ బ్యూరో బాపట్ల జనవరి 27:**


జిల్లా ఎస్పీ స్పందించిన తీరు పట్ల హర్షం వ్యక్తం చేసిన అర్జీదారులు అర్జీ దారుల పట్ల సహృదయ భావనతో వ్యవహరించిలి. అర్జీలు పునరావృతం కాకుండా చట్టపరిధిలో సమస్యలు పరిష్కరించాలి. పిజిఆర్ఎస్ కార్యక్రమం ద్వారా వచ్చే అర్జీలు పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోము జిల్లా ఎస్పీ తుషార్ డూడి అర్జీ దారుల పట్ల సహృదయ భావనతో వ్యవహరించాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడి పోలీస్ అధికారులకు సూచించారు. జనవరి 27న సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమాన్ని ఎస్పీ నిర్వహించారు. గత నెల గుండెకు శస్త్ర చికిత్స చేయించుకున్న బాపట్ల జిల్లా ఈపురుపాలెం గ్రామానికి చెందిన మురళి ప్రసాద్ అను వ్యక్తి నడవలేని స్థితిలో ఉండి విల్ చైర్ పై తన సమస్యను చెప్పుకోవడానికి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయానికి వచ్చినాడు. అతడి పరిస్థితిని పోలీస్ అధికారుల ద్వారా తెలుసుకున్న ఎస్పీ మానవతా దృక్పథంతో వ్యవహరిస్తూ క్రింద ఉన్న అర్జీ దారుడి వద్దకు స్వయంగా వెళ్లి యోగ క్షేమాలు, శస్త్ర చికిత్స గురించిన వివరాలు అడిగి ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. అతని సమస్యను కూలంకషంగా విని ఇచ్చిన అర్జీని పరిశీలించారు. చట్ట పరిధిలో సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని వారికి భరోసా ఇచ్చారు. ఇతర శాఖ అధికారులతో సమన్వయంతో వ్యవహరిస్తూ సమస్యను చట్టపరిధిలో పరిష్కరించాలని సంబంధిత పోలీస్ అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ స్పందించిన తీరుపట్ల అర్జీ దారులు హర్షం వ్యక్తం చేశారు. అర్జీలు పునరావృతం కాకుండా చట్టపరిధిలో సంతృప్తికర రీతిలో పరిష్కరించాలని ఎస్పీ పోలీస్ అధికారులను ఆదేశించారు. అర్జీ దారుల పట్ల సహృదయ భావనతో వ్యవహరించినప్పుడే వారి సమస్య, వారు పడే ఆవేదన మనకు అర్థం అవుతుందన్నారు. అప్పుడే వేగంగా స్పందించి వారి సమస్యలు పరిష్కరించగలమన్నారు. పిజిఆర్ఎస్ కార్యక్రమం ద్వారా వచ్చే అర్జీలు నిర్ణిత గడువులోగా పరిస్కారం చూపాలన్నారు. అర్జీ దారుల సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోమని ఎస్పీ పోలీస్ అధికారులను హెచ్చరించారు. ఈ రోజు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమంలో వివిధ సమస్యల పరిష్కారానికి మొత్తం 51 అర్జీలు వచ్చినాయి. ఈ కార్యక్రమంలో సీసీఎస్ డిఎస్పీ జగదీష్ నాయక్, పిజిఆర్ఎస్ సెల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, ఎస్.ఐ శ్రీనివాస్ ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# చివరి ఆయకట్టు వరకు నీటిని అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

- విద్యుత్ శాఖ మంత్రి రవికుమార్
- నీటి సంఘాల పదవులు అలంకరణ కాదు... బాధ్యత
- ప్రాజెక్టుల్లో నీటిని తోడేసి... ఇసుక అమ్ముకున్నచరిత్ర జగన్ రెడ్డిది
- రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా సంఘాలు అప్రమత్తంగా ఉండాలి








**పెన్ పవర్, జనవరి 27, అద్దంకి**

రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా... సమస్యలు తలెత్తకుండా... చివరి ఎకరం వరకూ సాగునీరు అందేలా నీటి సంఘాల సభ్యులు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ స్పష్టం చేశారు. అద్దంకిలో సాగునీటి సంఘాల అధ్యక్షులు, జలవనరుల శాఖ అధికారులతో మంత్రి గొట్టిపాటి రవి కుమార్ సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాగునీటి సంఘాల పదువులు అనేవి అలంకరణ కాదని., అది ఒక బాధ్యత అని మంత్రి గుర్తు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బాధ్యతతో ఇచ్చిన ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన హితవు పలికారు. సుమారు వెయ్యి మంది వరకు ఉన్నసాగునీటి సంఘాల సభ్యులు చిత్తశుద్ధితో విధులు నిర్వహిస్తే.... దాదాపు 1.75 లక్షల ఎకరాలకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా సాగునీరు అందుతుందని తెలిపారు. అందరూ కలిసి పని చేసి... ముఖ్యమంత్రి ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని.. కూటమి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకు రావాలని మంత్రి పిలుపునిచ్చారు. సాగునీటి సమస్యలతో రైతులు ఎక్కడా ఇబ్బంది పడకుండా చూడాలని మంత్రి గొట్టిపాటి మరోసారి స్పష్టం చేశారు.

**గుండ్లకమ్మను నిర్వీర్యం చేసి... ఇసుక దోచేసి**

గడిచిన ఐదేళ్ల కాలంలో సాగునీటి వ్యవస్థను జగన్ మోహన్ రెడ్డి నిర్వీర్యం చేశారని మంత్రి గొట్టిపాటి రవికుమార్ విమర్శించారు. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణను పూర్తిగా గాలికి వదిలేశారని ఆరోపించారు. గుండ్లకమ్మ ప్రాజెక్టును నిర్వీర్యం చేయడమే కాకుండా... గేట్లు విరగొట్టి... ఇసుక దోపిడీకి పాల్పడిన చరిత్ర జగన్ ప్రభుత్వానిదే అన్నారు. ఆంధ్రప్రదేశ్ తో పాటు కర్ణాటక రాష్ట్రంలోనూ విరిగిన ప్రాజెక్టుల గేట్లను యుద్ధ ప్రాతిపదికన బిగించి రైతుల సాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా చేసిన చరిత్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిదని అన్నారు. అదే స్ఫూర్తితో సీఎం చంద్రబాబును ఆదర్శంగా తీసుకుని సాగునీటి సంఘాల సభ్యులు రైతులకు ఇబ్బందులు లేకుండా చేయాలన్నారు. వ్యవసాయ సీజన్ మొదలయ్యే సమయానికి కాలువ కట్టలపై జంగిల్ క్లియరెన్స్ తో పాటు కాలువల మరమత్తులు పూర్తి చేయాలని మంత్రి గొట్టిపాటి అధికారులను ఆదేశించారు. అదే విధంగా వాట్సప్ గ్రూపులను ఏర్పాటు చేసుకుని సాగునీటి సమస్యలను ఫొటోలు తీసి సమస్య పరిష్కారమయ్యే విధంగా జల వనరుల శాఖ అధికారులను అప్రమత్తం చేయాలని సంఘాల సభ్యులకు మంత్రి గొట్టిపాటి సూచించారు. జలవనరుల శాఖ అధికారులతో పాటు సాగునీటి సంఘం సభ్యులూ సాంకేతికను వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్పి అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# జిల్లా ఉత్తమ తహసిల్దార్ రవికుమార్ కు ఘన సన్మానం





**పెన్ పవర్, జనవరి 27, అద్దంకి**

జిల్లా ఉత్తమ తాసిల్దారుగా గణతంత్ర దినోత్సవం రోజున జిల్లా కలెక్టర్ వెంకట మురళి చేతుల మీదుగా అవార్డు తీసుకున్న మండల తాసిల్దార్ రవిబాబును నియోజకవర్గంలోని మండల కేంద్రమైన సంతమాగులూరు లోని మండల పరిషత్ కార్యాలయం లో వున్న సమావేశ మందిరంలో రెవెన్యూ కార్యాలయ సిబ్బంది తహసిల్దార్ రవి బాబును ఘనంగా సన్మానించారు. రవిబాబు మండలంలోని ప్రజలకు చెరువులో ఉంటూ రెవిన్యూ సమస్యకు పరిష్కార దిశగా పనిచేస్తున్నారని సిబ్బంది కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ రాఘవరావు, ఆర్ ఐ రామారావు, మండల వీఆర్వోల సంఘం అధ్యక్షులు రావిరేల వాసు, వీఆర్వోలు గుంటూరు బాబు రాధిక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దేశభక్తి గీతాల ద్వారా జాతీయ భావాన్ని పెంపొందించవచ్చు

- స్వాతంత్ర ఉద్యమంలో దేశభక్తి గీతాలు ప్రముఖ పాత్ర
- ఇన్కం టాక్స్ ఆఫీసర్ కె. స్వర్ణలత
- అద్వితీయంగా సంస్కార భారతి "కలసి పాడుదాం" దేశభక్తి గీతాలు పోటీలు





**చీరాల, జనవరి 27 (పెన్ పవర్):**

కళారూపాలు కళలను నేర్చుకోవటం ద్వారా క్రమశిక్షణ అలవుడుతుందని అన్నారు. సంస్కార భారతి ఆధ్వర్యంలో విద్యార్థులకు కలసి పాడుదాం దేశభక్తి గీతాల బహుమతి ప్రదానోత్సవ సభలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. స్వాతంత్ర పోరాటంలో దేశభక్తి గీతాల ప్రాధాన్యత మరువలేనిదన్నారు. ఆంధ్రకేసరి విద్యా కేంద్రంలో జరిగిన కలసి పాడుదాం దేశభక్తి గీతాల పోటీల్లో బృంద గీతాలాపన పోటీల్లో సుమారు 40 బృందాలు పాల్గొన్నాయి. వీరిలో నారాయణ ఈటెక్నో, జుపిటర్, ఢిల్లీ, నిర్మల హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ బృందాలుగా ఎంపిక చేసి ఇన్కంటాక్స్ ఆఫీసర్ స్వర్ణలత బహుమతులు అందజేశారు. సభకు అధ్యక్షత వహించిన ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు పొన్నూరు వేంకట శ్రీనివాసులు మాట్లాడుతూ సాహిత్యం ఆలోచింపజేస్తే సంగీతం ఆనందింపజేస్తుందన్నారు. సంగీత సాహిత్యాలు స్వాతంత్ర్య ఉద్యమానికి ఊపిరిపోసాయని పేర్కొన్నారు. ఎకెవికె కాలేజీ ఛైర్మన్ మండువ నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులను సన్మార్గంలో తీర్చిదిద్దేందుకు ఎకెవికె విద్యా సంస్థలు నిరంతరం కృషిచేస్తున్నాయని తెలిపారు. సంస్కార భారతి జిల్లా కన్వీనర్ పత్తి రంగమన్నార్ మాట్లాడుతూ కళల ద్వారా సంస్కారవంతమైన సమాజాన్ని రూపొందించేందుకు ప్రతి సంవత్సరం గణతంత్ర దినోత్సవానికి, స్వాతంత్ర్య దినోత్సవానికి, హిందు దేవతల విశిష్టమైన కార్యక్రమాలు నిర్వహిస్తూ దేశభక్తి, దైవభక్తిని పెంపొదిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కోటిస్ షాపింగ్ మాల్ అధినేత కోటి సూర్యనారాయణ పాల్గొనగా న్యాయనిర్ణేతలుగా ఐ. మురళీకృష్ణ, పద్మా సురేష్, శారద, హరిప్రియ వ్యవహరించారు.

# గ్రామీణ ప్రాంత విద్యార్థులు కూడా కార్పొరేట్ పాఠశాల విద్యార్థులకు దీటుగా విద్యనభ్యసించాలి

- విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్
- అద్దంకి ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులకు ఉచితంగా సైకిళ్ల పంపిణీ చేసిన మంత్రి గొట్టిపాటి
- విద్యార్థుల విద్యాభ్యాసానికి ఇబ్బంది లేకుండా మంత్రి గొట్టిపాటి చర్యలు
- 6,7,8,9 తరగతుల వారికి త్వరలోనే మరో 10 వేల సైకిళ్ల పంపిణీకి ప్రణాళిక
- రోటరీ క్లబ్ నెదర్లాండ్స్ సాయంతో విద్యార్థులకు సైకిళ్లు అందజేసిన మంత్రి గొట్టిపాటి







**పెన్ పవర్, జనవరి 27,అద్దంకి**

నియోజకవర్గ కేంద్రమైన అద్దంకి లోని గ్రామీణ ప్రాంత విద్యార్థులను చదువుల వైపు ప్రోత్సహించేలా మంత్రి గొట్టిపాటి రవి కుమార్ మరో కీలక ముందడుగు వేశారు. సుదూర ప్రాంతాల నుంచి చదువుకునేందుకు అద్దంకి పట్టణానికి వస్తున్న పేద విద్యార్థినులకు సైకిళ్లను పంపిణీ చేశారు. విద్యార్థినులు ఎటువంటి ఇబ్బందీ లేకుండా తమ చదువులు కొనసాగించాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆకాంక్షించారు. అద్దంకి ప్రభుత్వ పాఠశాలకు చెందిన 8,9 తరగతుల బాలికలకు సోమవారం స్థానిక ప్రభుత్వ పాఠశాలలో మంత్రి గొట్టిపాటి ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేశారు. తమ వ్యక్తిగత నిధులు, నెదర్లాండ్స్ రోటరీ క్లబ్ తో పాటు కొందరు దాతల సహాయంతో విద్యార్థినులకు సైకిళ్లను అందజేశారు. విద్యార్థినులకు సైకిళ్లను అందజేసిన అనంతరం మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులు కూడా మిగిలిన వారితో చదువులో పోటీ పడాలని అభిలషించారు. రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన ప్రకాశం జిల్లాలో ఎక్కువ మంది పేదలు ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యాభ్యాసం చేస్తుంటారని వెల్లడించారు. అటువంటి వారు స్కూల్ కు రావాలన్నా సరైన రవాణా సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. రవాణా సదుపాయం లేక చదువులు ఆగకూడదన్న మంత్రి గొట్టిపాటి అద్దంకి నియోజకవర్గ పరిధిలో ఉన్న సుమారు 40 ప్రభుత్వ పాఠశాలల బాలికలకు సైకిళ్లను ఉచితంగా అందిస్తామని ప్రకటించారు. మంత్రి గొట్టిపాటి ఔదార్యానికి విద్యార్థులు తమ కరతాళధ్వనులతో హర్షం వ్యక్తం చేశారు

**5 కోట్ల రూపాయల వ్యయంతో ఏడాదిలో 10 వేల సైకిళ్ల పంపిణీ**

ప్రస్తుతం 8,9 తరగతుల బాలికలకు సైకిళ్లు ఇచ్చామని తెలిపిన మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఇక్కడకు వచ్చిన తరువాత 6,7 తరగతుల విద్యార్థినులకు సైకిళ్ల అవసరాన్ని గుర్తించి వారికి కూడా 20 రోజుల్లో అందజేస్తామని హామీ ఇచ్చారు. అద్దంకి నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల బాలికలకు సుమారు 10 వేల సైకిళ్లు అవసరమని గుర్తించి వాటిని కూడా ఏడాదిలో అందజేస్తామని ప్రకటించారు. రోటరీ క్లబ్ నెదర్లాండ్స్ వారి సహాయం, దాతల సహకారంతో పాటు సొంత నిధులతో నియోజకవర్గ బాలికలందరికీ సైకిళ్లను సమకూర్చుతామని ఆయన హామీ ఇచ్చారు. అందరికీ సైకిళ్లు అందజేయడానికి సుమారు రూ. ఐదు కోట్లకు పైగా వ్యయం అవుతుందని, సంవత్సరంలోపు అందరికీ సైకిళ్లను అందజేస్తామని మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు. అదే విధంగా అద్దంకి ప్రభుత్వ పాఠశాలలో మరో ఐదు తరగతి గదులు కావాలని పాఠశాల యాజమాన్యం కోరారని విద్యార్థులకు ఇబ్బంది లేకుండా తరగతుల నిర్వహణకు మరో ఐదు గదులను త్వరలోనే అందుబాటులోకి తెస్తామని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసిస్ట్ డైరెక్టర్ జాస్తి రంగారావు, రోటరీ క్లబ్ నెదర్లాండ్స్ ప్రతినిధులు లియో జ్వాగ్ మేకర్, కీస్ వాన్డెన్ బెర్గ్, కోన్ వెస్సర్ తో పాటు వివిధ శాఖల అధికారులు, పాఠశాల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్ఎంఎల్జే కళాశాలలో ప్రారంభమైన ఉచిత మధ్యాహ్న భోజనం పథకం






**చీరాల, జనవరి 27 (పెన్ పవర్):**

చీరాల పట్టణానికి నడిబొడ్డున ఉన్న విద్యా భాండాగారం సెయింట్ మార్క్స్ లూథరన్ జూనియర్ కళాశాలలో సోమవారం ఇంటర్మీడియట్ చదివే విద్యార్థిని విద్యార్థులకు ఉచిత మధ్యాహ్న భోజనం పథకం ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమానికి కళాశాల లైబ్రేరియన్ పుల్లగూర జయశీలరావు అధ్యక్షత వహించగా కళాశాల కరస్పాండెంట్ శీలం విద్యాసాగరరావు కళాశాల ప్రిన్సిపల్ గారపాటి పుష్పరాజు ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా సెయింట్ మార్క్స్ సెంటినరీ లూథరన్ చర్చ్ సంఘ కాపరి పిల్లి దేవదాసు విద్యార్థిని విద్యార్థులను ఉద్దేశించి బైబిల్ వాక్య పఠనం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రేమ నర్సింగ్ హోమ్ అధినేత ప్రముఖ వైద్యులు డాక్టర్ ఐ. బాబురావు విచ్చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బాబురావు మాట్లాడుతూ సెయింట్ మార్క్స్ జూనియర్ కళాశాలలో ఎక్కువ శాతం పేద మధ్యతరగతి కుటుంబాల నుండి వచ్చిన విద్యార్థిని విద్యార్థులు ఉంటారని అటువంటి వారికి చేయూతనందించడానికి తాము గత కొన్ని సంవత్సరాలుగా ఆర్థిక సాయం అందించడం జరుగుతుందని అన్నారు. ఇక్కడ ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత శాతం కూడా కార్పొరేట్ కళాశాలకు దీటుగా పోటీపడుతూ చదవటం విశేషం అన్నారు. మార్చిలో జరగబోయే ఇంటర్మీడియట్ పరీక్షలలో కూడా విద్యార్థులు ఎక్కువ శాతం విజయం సాధించి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. జయశీల రావు, పుష్పరాజులు మాట్లాడుతూ శ్యామ్ సుధాకర్, సుదీప్తి దంపతులు (దుబాయ్) వారి తల్లిదండ్రులైన పాల్ ప్రసాద్, విశ్రాంతమ్మల జ్ఞాపకార్థం గత పది సంవత్సరాల నుండి కొంత ఆర్థిక సహాయాన్ని అందించడం వారి సేవ దాతృత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. మరికొందరు దాతలు కూడా ముందుకు వచ్చి విద్యార్థిని విద్యార్థులకు సహాయ సహకారాలు అందజేయడం శుభసూచకం అన్నారు. ఈ కార్యక్రమంలో డి.బి.ఆర్.సి.చీరాల ఏరియా కో ఆర్డినేటర్ వి. భగవాన్ దాస్, సీఐటీయూ నాయకులు ఎన్. బాబురావు, కళాశాల అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# చీరాల మున్సిపాలిటీలో గెజిట్ అమలు చేయాలని కలెక్టర్‌కు ఫిర్యాదు



**చీరాల, జనవరి 27 (పెన్ పవర్):**

చీరాల పురపాలక సంఘం నందు అధికారుల నిర్లక్ష్యం వలన జరుగుతున్న బాపట్ల జిల్లా కలెక్టర్ ఆమోదం తెలిపిన గెజిట్లు రక్షించుట, అధికారులపై చర్యలు, గెజిట్ అమలు చేయుట గురించి బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకట మురళికి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో చీరాల 14వ వార్డుకు చెందిన కోనంగుల రమేష్ (హచ్ రమేష్) సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ చీరాల నందు తను బట్టల వ్యాపారం చేసుకొని జీవించుచున్నానని, చీరాల పురపాలక సంఘం పరిధిలో గల ఎ.ఆర్.యం. మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నందు మొదటి అంతస్తును చీరాల పురపాలక సంఘ అధికారులు చట్టబద్ధంగా జాగర్లమూడి శ్రీనివాస్ అనువారికి లీజుకు ఇచ్చియున్నారు. చీరాల పురపాలక సంఘ అనుమతులతో సదరు జాగర్లమూడి శ్రీనివాసరావు చీరాల పురపాలక సంఘ అవినీతి అధికారులతో కుమ్మక్కై 2023 జనవరి 10నుండి 2025 జనవరి 27వరకు చీరాల పురపాలక సంఘానికి చెల్లించవలసిన అద్దె చెల్లించకుండా చీరాల పురపాలక సంఘ ఆదాయానికి తీవ్రంగా నష్టపరిచారు. అంతేకాక చీరాల 19వ వార్డు కౌన్సిలర్ అయినటువంటి మించాల సాంబశివరావు అనువారికి జాగర్లమూడి శ్రీనివాసరావు బినామి అయ్యి కౌన్సిలరే బినామి పేర్లతో ఎ.ఆర్.యం. కాంప్లెక్స్ మొదటి అంతస్తు లీజుదారుడు అవ్వడం వలన 19వ వార్డు కౌన్సిలర్ ఇచ్చే ముడుపులకు తలొగ్గిన చీరాల పురపాలక సంఘ అధికారులు బాపట్ల జిల్లా కలెక్టర్ ఆమోదించి ఇచ్చిన చీరాల పురపాలక సంఘ గెజిట్‌ను అధికారులు, 19వ వార్డు కౌన్సిలర్, జాగర్లమూడి శ్రీనివాసరావు వయొలెట్ చేశారు. అంతేగాక ఇప్పటికీ సుమారు 28 లక్షల రూపాయల బకాయి చెల్లించవలసి ఉంది. లీజుదారుడు ప్రభుత్వ షాపింగ్ కాంప్లెక్స్ నందు రెస్టారెంట్స్, భోజన్ హోటల్స్ నిర్వహించకూడదని గెజిట్ నందు పొందుపరిచినప్పటికీ దానిని ధిక్కరిస్తూ రెస్టారెంట్ నడుపుతున్నారు. అంతేగాక అద్దె కట్టమని నోటీసులు నామకావాస్తు అధికారులు ఇస్తున్నప్పటికీ ఎ.ఆర్.యం. కాంప్లెక్స్ సెల్లార్ నాకు పార్కింగ్ గా ఇస్తే తప్ప నేను అద్దె చెల్లించనని గుత్తేదారుడు అధికారులను భయభ్రాంతులకు గురి చేశాడు. ముడుపులకు అలవాటుపడిన అధికారులు గుత్తేదారు దగ్గర ప్రతినెల ముడుపులు తీసుకుంటూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. చీరాల పురపాలక సంఘ గెజిట్ నందు ఎవరైనా గుత్తేదారుడు 3 నెలలు అద్దె చెల్లించనిచో ఎటువంటి నోటీసులు లేకుండా వారి లీజును రద్దు పరచేవిధంగా పొందుపరచి ఉన్నప్పటికీ పైవారెవరికీ గెజిట్ కనిపించడం లేదు. ఎన్నిసార్లు సదరు అద్దె వసూలు గురించి అధికారులు తెలిపినను వెకిలి నవ్వు నవ్వుతూ వాళ్ళు అద్దె కడితే మాకేంటి లాభం అంటున్నారు. కనుక మాయందు దయవుంచి చీరాల పురపాలక సంఘ గెజిట్ ను కాపాడి అవినీతి అధికారులపై చర్యలు తీసుకునే విధంగా ఆదేశాలను జారీ చేయగలరని కలెక్టర్‌కు రమేష్ వినతిపత్రం అందజేశానని తెలిపారు.

# చేనేత మంత్రిని కలిసిన ఆప్కో ఛైర్‌పర్సన్ హేమలత



**చీరాల, జనవరి 27 (పెన్ పవర్)**

రాష్ట్ర బిసి సంక్షేమం, చేనేత జౌళి శాఖా మంత్రి ఎస్. సవితని రాష్ట్ర ఆప్కో ఛైర్‌పర్సన్ డాక్టర్ సజ్జా హేమలత సోమవారం అమరావతిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చేనేతల సమస్యలను, అభివృద్ధికి చేయాల్సిన కార్యాచరణపై ఇరువురు చర్చించారు.

# వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్న బాపట్ల ఎంపీ



**చీరాల, జనవరి 27 (పెన్ పవర్)**

కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని లోకసభ ప్యానల్ స్పీకర్, బాపట్ల పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కృష్ణ ప్రసాద్ సోమవారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఎంపీకి వీఐపీ దర్శనం కల్పించి ఆలయ మర్యాదలతో సత్కారం అందజేశారు.

# పోలీసు అధికారులకు.. సిబ్బందికి ఎస్పీ అభినందన





**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జనవరి 27**

2024 సార్వత్రిక ఎన్నికల్లో సమర్ధవంతంగా విధులు నిర్వహించిన ఎలక్షన్ సెల్ పోలీసు అధికారులను సిబ్బందిని ప్రకాశం జిల్లా ఎస్పీ ఏ.ఆర్ దామోదర్ అభినందించారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో పటిష్ట బందోబస్తు స్కీమ్ ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎన్నికల ప్రక్రియ సజావుగా, శాంతియుతంగా ముగిసే విధంగా సమిష్టిగా, సమన్వయంతో ఎలక్షన్ సెల్ విభాగంలో సమర్ధవంతంగా విధులు నిర్వహించిన 15 మంది పోలీసు అధికారులు, సిబ్బందిని సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి, వారికి ప్రశంసా పత్రాలను అందజేసారు. జిల్లా యొక్క నైసర్గిక మరియు భౌగోళిక విస్తీర్ణం, సరిహద్దులు అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాలు, మండలాలు, పోలింగ్ లొకేషన్లు, పోలింగ్ స్టేషన్ లు యొక్క సమాచారం, ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా గైడ్ లైన్స్ నుంచి వచ్చే సమాచారాన్ని ఎప్పటికప్పుడు అధికారులకు చేరవేయడం అధికారుల ఆదేశాల ప్రకారం వాటిని క్రోడీకరించటం, క్షేత్రస్థాయిలో ప్రతి ఒక్క పోలీస్ స్టేషన్ లిమిట్స్ లో పూర్తి సమాచారం, భద్రతా పరంగా ముందస్తు సమాచారం సేకరించటం, ప్రతి రోజు డిఎస్ఆర్ పంపటం, జిల్లాతో డిజిపి ఆఫీస్, ఎన్నికల కమిషనర్ లతో సమన్వయంతో జిల్లాలో ప్రశాంతంగా ఎన్నికలు జరగటానికి కృషి చేశారని జిల్లా ఎస్పీ కొనియాడారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జనరల్ ఎలక్షన్ సమయంలో ప్రకాశం జిల్లాలో పకడ్బందీగా బందోబస్తు స్కీమ్ ను అమలు చేసినందుకు జిల్లా ఎలక్షన్ సెల్ ఇన్స్పెక్టర్ కి రాష్ట్ర ఎన్నికల కమీషన్ నుండి ఎక్సలెన్స్ ఇన్ కండక్టింగ్ ఎలక్షన్స్ %ఇ% సెక్యూరిటీ మేనేజ్మెంట్ అవార్డు అందుకోవడం అభినందనీయమైన విషయమనీ, జిల్లాలో ఎక్కువ శాతం ఓటింగ్ నమోదు అయిందన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో మెరుగ్గా పని చేయాలని, జిల్లాలో ఎక్కడ ఎటువంటి శాంతిభద్రతల సమస్యలు ఉత్పన్నం కాకుండా సమిష్టిగా కృషి చేయాలని సిబ్బందికి జిల్లా ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో ఐటి కోర్ సీఐ వి. సూర్యనారాయణ, ముండ్లమూరు ఎస్సై నాగరాజు, మహిళా పియస్ ఎస్సై వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## కలెక్టర్ కు జిల్లా యన్ జి జి ఓ అసోసియేషన్ అభినందన





**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జనవరి 27**

ఉత్తమ ఎలక్ట్రరల్ అధికారిగా ఎన్నికై అవార్డు పొందిన ప్రకాశం జిల్లా ఉత్తమ ఎలక్ట్రరల్ అధికారిగా ఎన్నికై అవార్డు పొందిన ప్రకాశం జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సరియా ని కలసి యన్ జి జి ఓ అసోసియేషన్ ప్రకాశం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె. శరత్ బాబు, ఆర్ సి హెచ్ కృష్ణా రెడ్డి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రకాశం భవనం లో మహిళా ఉద్యోగులకు వెయిటింగ్ హాల్ కేటాయించాలని జిల్లా కలెక్టర్ ని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు యం.వేంకటేశ్వర రావు, జిల్లా కోశాధికారి కె. శివ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు తోట శ్రీనివాసు, పి. రామాంజనేయులు, కె. చిరంజీవి రావు, బి. కృష్ణ కిషోర్ జిల్లా సంయుక్త కార్యదర్శులు పి. విజయ్ కుమార్, కిరణ్, షేక్. మోయిన్, ఒంగోలు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు కొత్తపల్లి మంజేశ్, షేక్. మగ్దుం షరీఫ్ ఒంగోలు పట్టణ సంయుక్త కార్యదర్శులు షేక్ కరిముల్లా, నారాయణమ్మ, మహిళా విభాగం జిల్లా చైర్మెన్ కె. కోటేశ్వరమ్మ, జిల్లా కన్వీనర్ సి. హెచ్. శిరీష ఒంగోలు పట్టణ చైర్మన్ జ్యోతి, కార్యవర్గ సభ్యులు జయమ్మ, పద్మజ, తులసీ తదితరులు పాల్గొన్నారు.

## సెయింటాన్స్‌లో ప్రారంభమైన వియల్‌సిఐ డిజైన్ వర్క్‌షాపు



**వేటపాలెం, జనవరి 27 (పెన్ పవర్):**

స్థానిక సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజిలో సోమవారం నుండి ఇ.సి.ఇ విభాగ మూడవ సం. విద్యార్థులకు వి.యల్.సి.ఐ డిజైన్ పై మూడు రోజుల వర్క్‌షాపును ప్రారంభించినట్లు కళాశాల సెక్రటరి వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ యస్. లక్ష్మణరావు సంయుక్తముగా తెలిపారు. ఈ సందర్భముగా కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. జగదీష్ బాబు మాట్లాడుతూ ఆధునిక టెక్నాలజిలపై అనుబంధం పెంచుకోవటం వలన విద్యార్థులు ఆధునిక పరిశ్రమలలో ఉత్తమంగా రాణించవచ్చని తెలిపారు. వి.యల్.సి.ఐ డిజైన్ పై మూడు రోజుల వర్క్‌షాపును కల్కి టెక్నాలజీస్, హైదరాబాద్ ఆధ్వర్యములో నిర్వహిస్తున్నట్లు ఇ.సి.ఇ విభాగాధిపతి డా. డి. రాజెంద్ర ప్రసాద్ తెలియజేశారు. ఈ వర్క్ షాపులో పాల్గొనటం విద్యార్థులకు ఎంతో ఉపయోగము అని తెలిపారు. కల్కి టెక్నాలజీస్ నుండి వివేక్ బృందము ఆధ్వర్యములో వి.యల్.సి.ఐ డిజైన్ ఫ్రంట్ ఎండ్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించి వివాడో సాఫ్ట్‌వేర్ ద్వారా ప్రయోగాలను నిర్వహిస్తారని తెలియజేశారు. ఈ వర్క్‌షాపునకు డా. డి.వి.యన్. సుకన్య, జె. కవిత కోఆర్డినేటర్లుగా వ్యవహరిస్తున్నారు.

## సెమిస్టర్ ఎగ్జామ్ బుక్లెట్ లాంచ్





**చీరాల, జనవరి 27 (పెన్ పవర్):**

స్వయం ప్రతిపత్తి హోదా (అటానమస్) ఎంపిక అయిన తరువాత ఆర్కె కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అటానమస్ ఎకాడమిక్ ఇయర్ 2024-2025 1-1 సెమిస్టర్ ఎగ్జామ్ బుక్లెట్‌ని ఫౌండర్ ఆఫ్ ఆర్కె ఇంజనీరింగ్ కాలేజ్, చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య సోమవారం లాంచ్ చేశారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్, స్టాఫ్, పాల్గొన్నారు.

## ప్రమాదాల నివారనకై

# ఇసుక డ్రమ్ములు ఏర్పాటు














**వేటపాలెం, జనవరి 27 (పెన్ పవర్):**

చీరాల, వేటపాలెం బైపాస్ రోడ్డుపై ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాలు అధికమవడంతో వాటి నివారణకై బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్ దూడీ ఉత్తర్వులు మేరకు చీరాల డిఎస్పి మొయిన్ ఆదేశాల మేరకు చీరాల రూరల్ సిఐ శేషగిరిరావు, వేటపాలెం ఎస్ఐ ఎం. వెంకటేశ్వర్లు సోమవారం వేటపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని బైపాస్ జంక్షన్ ఏరియాలైన పందిళ్ళపల్లి, నాయునిపల్లి, కొత్తకాలువ, వేటపాలెం, చల్లారెడ్డిపాలెం, అక్కాయిపాలెం జంక్షన్ల వద్ద ఇసుకతో నింపిన డ్రమ్స్, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వాహనదారులు ప్రమాదాల జరుగకుండా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని, సెల్ ఫోన్ మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనం నడపరాదని, అతివేగం పనికిరాదని, మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని, మనకోసం కుటుంబం ఎదురు చూస్తుందనే విషయాన్ని గుర్తు ఉంచుకుని జాగ్రత్తగా వాహనాలను నడపాలని అన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉత్తమ సర్పంచ్ అవార్డు గ్రహీత శ్రీమతి ఆదిలక్ష్మి వెంకటపతి రాజును ఘనంగా సత్కరించిన డాక్టర్ గ్లోరి యానెట్ సొపాటి





**పెన్ పవర్ బ్యూరో బాపట్ల జనవరి 27**

మంచివారు,మృదుస్వభావి,సేవా తత్పరులు, సహృదయులు రాష్ట్ర ఉత్తమ సర్పంచ్ అవార్డు గ్రహీత గౌరవ శ్రీమతి లక్కింశెట్టి ఆదిలక్ష్మి వెంకటపతి రాజు గారి దంపతులను ఘనంగా సత్కరించిన మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరి యానెట్ సొపాటి . ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిన్న రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన ఉత్తమ సర్పంచ్ అవార్డు గ్రహీత ఆదిలక్ష్మి గారు మన మండలంకు,మన బాపట్ల నియోజకవర్గముకు, మన జిల్లా మొత్తం గర్వించదగిన విషయమని ఈ సందర్భంగా తెలియజేశారు. గ్రామ అభివృద్ధి మరియు సంక్షేమమే ధ్యేయంగా ఆలోచిస్తు, పనిచేస్తున్న మీకు తోడుగా గౌరవ శాసనసభ్యులు శ్రీ వేగేశన నరేంద్ర వర్మ గారి సహాయ సహకారంతో మంతెనవారి పాలెం గ్రామాన్ని ఒక మాదిరి(మోడల్ )గ్రామముగా తీర్చి దిద్దుతారని, మీరు చేసిన గ్రామ అభివృద్ధిని మిగతా గ్రామలు అందరికీ మాదిరిగా ఉంటారని, కోవిడ్ సమయంలో మీరు చేసిన సేవా కార్యక్రమాలు,మీ ఆలోచన విధానం హర్షించదగినది. మీరు ఇంకా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అవార్డు అందుకోవాలని ఈ సందర్భంగా కోరుకుంటున్నాము. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు,పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు ఇచ్చే పరికరాల కోసం పేర్ల నమోదు కార్యక్రమం

**గిద్దలూరు పెన్ పవర్ జనవరి 27**

గిద్దలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాలకు సంబంధించిన దివ్యాంగులకు, వృద్ధులకు అలింకో సంస్థ ద్వారా చేతి కర్రలు, చంక కర్రలు, వీల్ చైర్లు వినికిడి యంత్రాలు, మూడు చక్రాల సైకిల్లు, అందుల చేతి కర్రలు, ఎల్బో క్రచెస్, రోల్ టైర్స్ (బ్యాటరీ సైకిల్స్ 80% శారీరక దివ్యాంగత్వం కలిగి ఉన్నవారికి) మొదలగు పరికరాలు అవసరం అయిన వారి కొరకు గిద్దలూరు పట్టణంలోని ఏరియా హాస్పిటల్ పిఆర్ కాలనీ నందు బుధవారం నుంచి వారి యొక్క పేరు నమోదు కార్యక్రమము జరుగుచున్నదని ఆ సంఘ అధ్యక్షులు శ్రీ పోలూరి వెంకటస్వామి తెలిపారు. ఈ కార్యక్రమానికి అరత ఉన్న దివ్యాంగులు అందరూ తప్పనిసరిగా ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు నమోదు జరుగుతుందన్నారూ సర్టిఫికెట్స్ రేషన్ కార్డ్స్, ఆధార్ కార్డు, వికలత్వాన్ని సూచించే రెండు ఫోటోలు, ఇన్కమ్ సర్టిఫికేటు,యూ ఐ డి కార్డు , ఫోన్ నెంబరు తప్పనిసరిగా తీసుకొని హాజరుకావాలని ( యూ ఐ డి కార్డు లేనివారికి కొత్త యూ ఐ డి కార్డు అప్లై చేయబడును అలాగే బస్ పాస్ లు, రైల్వే పాస్ లు కూడా అప్లై చేయబడును). ఈ కార్యక్రమాన్ని అధికారులు, అనదికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు , దివ్యాంగులు కలిసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తారని, సందేహాలు కలిగిన వారు ఈ ఫోన్ నెంబర్ కు 9666239076 సంప్రదించాలని శ్రీ పోలూరు వెంకటస్వామి తెలిపారు

## యర్రగొండపాలెం శాసనసభ్యులు తాటిపర్తి ఘన స్వాగతం



**పెద్ద దోర్నాల పెన్ పవర్ జనవరి 27**

పట్టణంలోని బొగ్గరపు సత్యమమ్మా కల్యాణమండపం లో దోర్నాల సేఫ్టీ డ్రైవర్స్ అసోషసియేషన్ ప్రెసిడెంట్ షేక్ షేక్షావలి వాలీమా రిసెప్షన్ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి యర్రగొండపాలెం శాసనసభ్యులు శ్రీ తాటిపర్తి చంద్రశేఖర్ ఆశీర్వందించిన. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ గంటా వెంకటరమణారెడ్డి. మొద్దు తిరుపతిరావు చిన్న గుడిపాడు సర్పంచ్ వల్లపు నేను పవన్ కుమార్ ఉప సర్పంచ్ దూదేకుల రసూల్. అల్లు రాంభూపాల్ రెడ్డి వెన్న వెంకటేశ్వర రెడ్డి వైసీపీ నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రదీప్‌ను అభినందించిన స్టేట్ ఫైర్ అధికారి

**వేటపాలెం, జనవరి 27 (పెన్ పవర్)**

పందిళ్ళపల్లికి చెందిన మారథాన్ క్రీడాకారుడు రాయిడి ప్రదీప్ నాయుడిని రాష్ట్ర అగ్నిమాపక శాఖ ఐజీ మురళి అభినందించారు. అమరావతిలోని ఫైర్ ఆఫీస్‌లో సోమవారం ఆయనను ప్రదీప్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తాను సాధించిన పతకాల గురించి ప్రదీప్ తెలియజేయగా ఐజీ తనవంతు సహకారం అందిస్తానని అభినందించారు.



# 29న దివ్యాంగులగుర్తింపు కొరకు శిబిరం ఏర్పాటు

**అమ్మ ఫౌండేషన్ కోశాధికారి సుధాకర్ యాదవ్**



**కొమరోలు పెన్ పవర్ జనవరి 27**

ఈనెల 29వ తేదీ గిద్దలూరు లోని పి ఆర్ కాలనీలోని ఏరియా ఆసుపత్రిలో ఆలింకో సంస్థ ద్వారా 80 శాతం దివ్యాంగత్వం ఉన్న వారిని గుర్తించేందుకు ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేయనున్నట్లుగా అమ్మ ఫౌండేషన్ కోశాధికారి సుధాకర్ యాదవ్ తెలిపారు. గిద్దలూరు నియోజకవర్గంలోని 6 మండలాలలో గల 80 శాతం దివ్యంగత్వం గల వారిని గుర్తించి వారికి ఆలింకో సంస్థ ద్వారా సహాయ పరికరాలు అందించేందుకు ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లుగా ఆయన చెప్పారు .గుర్తింపు పొందిన దివ్యాంగులకు చేతి కర్రలు , చంక కర్రలు ,వీల్ చైర్లు, వినికిడి యంత్రాలు, మూడు చక్రాల సైకిల్, అందుల చేతి కర్రలు, ఎల్బో కచేస్, రోల్ టైల్స్, బ్యాటరీ సైకిల్లు, తదితర వాటిని ఆలింకో సంస్థ అందజేస్తుందని చెప్పారు, 29వ తేదీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు దివ్యంగత్వం గల వారిని గుర్తింపు కార్యక్రమం జరుగుతుందన్నారు. కావున 80% పైబడి దివ్యాంగత్వం గలవారు రేషన్ కార్డు, ఆధార్ కార్డు, వికలాంగత్వం సూచించే రెండు ఫోటోలు ,ఆదాయ సర్టిఫికెట్, యుఐడి కార్డు ,ఫోన్ నెంబర్ తో హాజరు కావాలని ఆయన కోరారు. యు ఐ డి కార్డు లేని వారికి కొత్త యుఐడి కార్డు అప్లై చేయుటకు ఏర్పాటు చేశామన్నారు .కావున గిద్దలూరు నియోజకవర్గంలోని దివ్యాంగులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# అల్లినగరం హై స్కూల్ ఆఫీస్ సబార్డినేటర్ అశ్వినీదేవికి సన్మానం



**కొమరోలు పెన్ పవర్ జనవరి 27**

జిల్లా స్థాయిలో ఉత్తమ ఆఫీస్ సబార్డినేటర్ గా అవార్డు పొందిన ఎం అశ్వినీ దేవికి అల్లినగరం మునగనూరి వెంకటసుబ్బయ్య అండ్ సన్స్ జిల్లా హై స్కూల్ లో సోమవారం సన్మానించి అభినందించారు .అల్లినగరం హై స్కూలులో ఆఫీస్ సబారినేటర్గా పనిచేస్తున్న అశ్వినీ దేవి సేవలను గుర్తించిన జిల్లా కలెక్టర్ ఆమెను జిల్లా స్థాయిలో ఉత్తమ ఆఫీస్ సబార్డినేటర్గా ఎంపిక చేశారు. ఆ సందర్భంగా ఆదివారం ఒంగోలులో నిర్వహించిన గణతంత్ర వేడుకల సందర్భంగా జిల్లా కలెక్టర్ తమీం అన్సరియా ,జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ అశ్వినీ దేవికి ఉత్తమ సేవా అవార్డు అందించి అభినందించారు .ఆ సందర్భాన్ని పురస్కరించుకుని సోమవారం అల్లినగరం హై స్కూల్లో అశ్వినీ దేవికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు .ఆ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన దాసరి గురుస్వామి అశ్విని దేవి సేవలను కొనియాడుతూ ఉద్యోగంలో చేరిన రెండున్నర సంవత్సరాలకే జిల్లా స్థాయిలో ఉత్తమ ఆఫీస్ సభార్డినేటర్గా అవార్డు పొందడం హర్షనీయం అభినందనీయమని పేర్కొన్నారు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదిగి మరెన్నో అవార్డులు పొందాలని ఆయన ఆకాంక్షించారు. అశ్వినీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించి, అభినందించారు. తనను సన్మానించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులకు అశ్విని దేవి ధన్యవాదాలు తెలిపారు. ఆ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎన్వి నారాయణ ,కోటేశ్వరరావు, సుజాత ,చంద్రమోహన్, శివరాం, ప్రకాశరావు, గురువయ్య, బోధనేతర సిబ్బంది వీరారెడ్డి, పకీరయ్య ఆ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# కళలు నేర్చుకోవటంతో నే క్రమశిక్షణ అలవడుతుంది

**ఇన్కమ్ టాక్స్ అధికారి స్వర్ణలత**

**క్రైమ్ రిపోర్టర్. ఒంగోలు. పెన్ పవర్. జనవరి 27**

కళారూపాలు కళలను నేర్చుకోవడం ద్వారా క్రమశిక్షణ అలవాటుతోందని ఇన్కమ్ టాక్స్ ఆఫీసర్ కే. స్వర్ణలత అన్నారు. సంస్కార భారతీయ ఆధ్వర్యంలో విద్యార్థులకు కలిసి పాడుదాం దేశభక్తి గీతాలు బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. స్వాతంత్ర పోరాటంలో దేశభక్తి గీతాల ప్రాధాన్యత మరువలేనిదని అన్నారు. ఆంధ్ర కేసరి విద్యా కేంద్రంలో కలిసి పాడుదాం దేశభక్తి గీతాలు పోటీల్లో బృంద గీతా లాపన పోటీల్లో 45 బృందాలు పాల్గొన్నారు. వీరిలో నారాయణ ఈ టెక్నో స్కూల్, జూపిటర్, ఢిల్లీ, నిర్మల హై స్కూల్ విద్యార్థులు ఉత్తమ బృందాలుగా ఎంపిక చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి పొన్నూరు వెంకట శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో కోటీస్ సూపర్ మాల్ అధినేత సూర్యనారాయణ, ఐ మురళి, పద్మ, సురేష్, శారద, హరిప్రియ ఉన్నారు.

# నూతన బస్సులను ప్రారంభించిన గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల

**బస్సు స్టేషన్ ను సుందరంగా తీర్చి దిద్దుతాం**

**గిద్దలూరు ఆర్టీసీ డిపో జిల్లాలో నే ప్రాముఖ్యత సంతరించుకొంది**

**వైకాపా ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వం లో విలీనం చేశారు కానీ ఉద్యోగుల సమస్యలను గాలికి వదిలేశారు**







**గిద్దలూరు పెన్ పవర్ జనవరి 27**

గిద్దలూరు పట్టణంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి సోమవారం సాయంత్రం ఏ.పీ.ఎస్.ఆర్టీసీ బస్ స్టేషన్ ఆవరణలో నూతన బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి పూజాకార్యక్రమాల నిర్వహించి , రిబ్బన్ కట్ చేసి, పచ్చ జెండా ఊపి, ఆర్టీసీ బస్సును స్వయంగా నడిపి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే అశోక్ రెడ్డి మాట్లాడుతూ 1977లో గిద్దలూరు ఏపీఎస్ఆర్టీసీ డిపో ఏర్పడిందని అప్పట్లోనే జిల్లాలో గిద్దలూరు డిపో ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుందని,పేర్కొన్నారు, కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రస్తుతం 5 నూతన ఏపీఎస్ఆర్టీసీ బస్సులు ప్రారంభించడం జరిగిందన్నారు . కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే 6 బస్సు లను ప్రారంభించామని ప్రస్తుతం మరో 5 బస్సులు ప్రారంభిచటం జరిగిందన్నారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంలో గిద్దలూరు ఏపీఎస్ ఆర్టీసీ బస్టాండ్ ను సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు . ఆర్టీసీ ఉద్యోగులతో యూనియన్ నాయకులతో డిపో మేనేజర్ తో కలిసి గిద్దలూరు డిపో అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. గత ప్రభుత్వం కేవలం ఏపీఎస్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి ఉద్యోగుల సమస్యలను గాలికి వదిలేసారని ఆరోపించారు .కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉద్యోగుల సమస్యలన్నీ పరిష్కరిస్తామని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు జడ్పీటీసీ సభ్యులు బుడతా మధుసూదన్, ఆర్టీసీ డిపో మేనేజర్ బత్తుల చంద్రశేఖర్, నగర పంచాయతీ కమిషనర్ వెంకటదాసు, మండల రెవిన్యూ అధికారి ఆంజనేయరెడ్డి, పట్టణ అధ్యక్షులు సయ్యద్ శానేశావలి, పట్టణ కౌన్సిలర్లు, తెలుగుదేశం నాయకులు, ఆర్టీసీ యూనియన్ నాయకులు, ఆర్టీసీ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు కృతజ్ఞతాభివందనాలు

**ఎమ్మెల్యే ఏలూరి**





**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జనవరి 27**

పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు తెలుగు ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఆదివారం ఎమ్మెల్యే ఏలూరి పుట్టినరోజు వేడుకలు కన్నుల పండుగగా జరిగాయి. ఈ వేడుకల నేపథ్యంలో ఎమ్మెల్యే ఏలూరికి రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు విదేశాల నుంచి పలువురు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే ఏలూరికి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు కూటమి నేతలు పలువురు ప్రజా ప్రతినిధులు అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. పలువురు ప్రత్యక్షంగాను పరోక్షంగాను సోషల్ మీడియా వేదికగా ఎమ్మెల్యే కు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే ఏలూరి బర్త్ డే వేడుకల సందర్భంగా పలు సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి కనివిని ఎరుగని రీతిలో సేవా కార్యక్రమాలను విస్తృతం చేశారు. అలాగే ఎమ్మెల్యే ఏలూరి తన పుట్టిన రోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలి పేందుకు వచ్చేవారు కేకులు పుష్పగు చ్చాలు.. పూలమాలలు శాలువాలు తీసుకురావద్దని వాటి స్థానంలో విద్యార్థులకు అంగన్వాడి కేంద్రాలలో పుస్తకాలు పెన్నులు ఇవ్వాలని వాటి ఫోటోలు తనకు షేర్ చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే పిలుపుమేరకు ప్రజలు నాయకులు అధికారులు పుష్పగుచ్చాలు కేకుల స్థానంలో నోటు పుస్తకాలు పెన్నులు అందించి అభిమాన నాయకుడి నిర్ణయాన్ని స్వాగతించారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ఏలూరి ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నూతన విధానానికి శ్రీకారం చుట్టిన తనకు మద్దతుగా నిలిచి అమలు చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. తన జన్మదిన వేడుకలకు హాజరై శుభాకాంక్షలు తెలిపిన మంత్రులకు ఎమ్మెల్యేలకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.

ప్రజలు చూపిన అభిమానాన్ని మద్దతుతో రెట్టించిన ఉత్సాహంతో ప్రజాసేవకు ప్రాధాన్యతనిస్తానని పేర్కొన్నారు. ప్రజాసేవే తన లక్ష్యమని పునరుద్ఘటించారు. తన జన్మదిన వేడుకల్లో వేలాదిగా పాల్గొని మెడికల్ క్యాంపులు కంటి వైద్య శిబిరం, దివ్యాంగుల సేవా కార్యక్రమాలను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. పర్చూరు నియోజకవర్గ ప్రజల ఆదరాభిమానాలు ఎన్నటికీ మరువలేనన్నారు. ఎన్టీఆర్ ఆశీస్సులు చంద్రబాబు స్ఫూర్తితో ప్రజలకు మరిన్ని సేవా కార్యక్రమాలు అందజేస్తానన్నారు.

# సమిష్టి కృషితో ఒంగోలు కార్పొరేషన్‌కు ప్రథమ స్థానం

**అవార్డులు అందుకున్న ఉద్యోగులను సిబ్బందిని అభినందించిన మేయర్, కార్పొరేటర్లు**





**క్రైమ్ రిపోర్టర్. ఒంగోలు**
**పెన్ పవర్. జనవరి 27.**

76వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా నగరంలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్లో నిర్వహించిన వేడుకల్లో స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్-స్వచ్ఛ ఒంగోలు శకటానికి ప్రథమ స్థానం రావడానికి ఉద్యోగులు సిబ్బంది సమిష్టి కృషితోనే సాధ్యమైందని మేయర్ గంగాడ సుజాత అన్నారు. ఒంగోలు నగరపాలక సంస్థ సకటానికి ప్రథమ స్థానం దక్కించుకున్న సందర్భంగా నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం అభినందన సభ నిర్వహించారు. ఈ సభకు కమిషనర్ డాక్టర్ కోడూరు వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. శకటానికి ఏర్పాటుచేసిన ఇంజనీరింగ్ బాగా సిబ్బంది మరియు శానిటేషన్ సిబ్బంది కృషి ప్రథమము కమిషనర్ వెంకటేశ్వరరావు, మేయర్ గంగాడు సుజాత అన్నారు. అభినందన సభ సందర్భంగా మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ ఒంగోలు చరిత్రలోనే మొదటిసారిగా నగరపాలక సంస్థ ఏర్పాటుచేసిన సకటమునకు మొదటి బహుమతి రావడం అనేది చాలా సంతోషకరమైనదని అన్నారు. శకట తయారీలో పాల్గొన్న ఇంజనీరింగ్ మరియు సానిటేషన్ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. రాబోయే రోజుల్లో ఇలానే మన ఒంగోలు నగరపాలక సంస్థకు అన్ని రంగాల్లో మొదటి స్థానం నిలబెడతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వారు ఆశిస్తున్నట్లు తెలిపారు. మాజీ కార్పొరేటర్ పసుపులేటి శ్రీనివాసరావు, కార్పొరేటర్లు చింతపల్లి గోపి, ఏ శాండిల్య, మున్సిపల్ ఇంజనీర్ చంద్రయ్య, డి ఈ పద్మజ, ఏ ఈ సౌజన్య, రాజశేఖర్, శానిటరీ సూపర్వైజర్ పిచ్చయ్య, సానిటరీ ఇన్స్పెక్టర్ మిరియం శ్రీను, శ్రీరామ్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# విజయసాయిరెడ్డి స్థానంలో నల్లారి...

**తిరుపతి, జనవరి 27, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ లో రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయి. విజయసాయిరెడ్డి రాజీనామాతో ఆయన స్థానంలో ఎవరిని ఎంపిక చేస్తారన్న దానిపై చర్చ జరుగుతుంది. అయితే మెగాస్టార్ చిరంజీవి పేరు ప్రముఖంగా వినపడుతున్నా అది ప్రచారం మాత్రమేనంటున్నారు. చిరంజీవి రాజకీయాలకు దూరంగా ఉండాలనుకుంటున్నారు. ఆయన సినిమాలకు మాత్రమే పరిమితమవుతున్నారు. ఆయన మోదీతో కలిసి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నంత మాత్రాన రాజకీయాల్లోకి తిరిగి ఎంట్రీ ఇచ్చినట్లు కాదని జనసేన ముఖ్యనేతలే చెబుతున్నారు. చిరంజీవి కూడా రాజ్యసభ పదవిని తీసుకునేందుకు ఇష్టంగా లేరు. అస్సలు రాజకీయాల జోకి రాకూడదని ఆయన బలంగా నిర్ణయించుకున్నారని మెగా ఫ్యాన్స్ చెబుతున్నారు అయితే విజయసాయిరెడ్డి రాజీనామాతో ఖాళీ అయిన స్థానంలో మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి పేరు ప్రముఖంగా వినిపిస్తుంది. నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి అయితే చంద్రబాబు నాయుడు నుంచి కూడా పెద్దగా అభ్యంతర పెట్టకపోవచ్చని అంటున్నారు. చిత్తూరు జిల్లాలో నల్లారి, నారా కుటుంబాలు కలిస్తే వచ్చే ఎన్నికల్లోనూ అత్యధిక స్థానాలను సాధించవచ్చని, దీంతో పాటు రెడ్డి సామాజికవర్గంలోనూ సానుకూలత కూటమి పార్టీలకు లభిస్తుందన్న అంచనాతో ఆయనను ఎంపిక చేసే అవకాశాలున్నాయంటున్నారు. మొన్నటి ఎన్నికల్లో రాజంపేట నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమి పాలయిన తర్వాత నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి గత కొంతకాలం మౌనంగా ఉంటున్నారు. ఇటీవల ఆయన యాక్టివ్ కావడంతో హస్తిన నుంచి వచ్చిన సంకేతాలే కారణమని చెబుతున్నారు. విజయసాయిరెడ్డి రాజీనామా తన వల్లనే జరిగింది కాబట్టి తమకే కేటాయించాలని బీజేపీ పట్టుబట్టిందని, ఇప్పటికే చంద్రబాబు దృష్టిలో ఉందని, ఇటీవల అమరావతి లో జరిగిన హైలెవెల్ మీటింగ్ లోనే ఈ విషయం చర్చకు వచ్చినట్లు పార్టీ వర్గాల్లో గుసగుసలాడుతున్నాయి. కేంద్రంలో కీలకమైన నేతను విజయసాయిరెడ్డి గత కొంత కాలం కలిసినప్పుడే రాజీనామా ఫిక్స్ అయిపోయిందంటున్నారు. అయితే వెనువెంటనే కాకుండా రాజీనామా నిర్ణయాన్ని కొంత ఆలస్యంగా విజయసాయిరెడ్డి వెల్లడించారని




అంటున్నారు. ఈ స్థానంలో నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి పేరు దాదాపు ఖాయమయినట్లేనని అంటున్నారుచంద్రబాబు కూడా అందుకే చిత్తూరు జిల్లా నుంచి మంత్రి లేకుండా

తన కేబినెట్ ను విస్తరించడం కూడా అందుకు కారణమని చెబుతున్నారు. నల్లారి కుటుంబాన్ని పక్కనపెట్టారంటే అప్పుడే కొందరు సందేహించారు. అన్నదమ్ముల్లో ఒకరికి మంత్రి పదవి లభిస్తే మరొకరికి రాజ్యసభ పదవి దక్కదని భావించి పదవులకు దూరంగా ఉన్నారన్న టాక్ కూడా వినపడుతుంది. నల్లారి కిషోర్ కుమార్ రెడ్డిని 2014 టీడీపీ అధికారంలో ఉన్నప్పుడే పార్టీలో చేరిన వెంటనే నామినేటెడ్ పదవిని ఇచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నారు. ఇప్పుడు విజయసాయిరెడ్డి రాజీనామాతో ఖాళీ అయిన రాజ్యసభ పదవికి రెడ్డి కోటాలో నల్లారిని ఎంపిక చేస్తారన్న టాక్ బలంగా వినిపిస్తుంది. మరి ఏం జరుగుతుందన్నది చూడాలి.

## కొందరు సైలెంట్... మరి కొందరు నిష్క్రమణ...

# వైసీపీలో ఏం జరుగుతోంది..

**నెల్లూరు, జనవరి 27, పెన్ పవర్:** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో రాజీనామాల పరంపరకొనసాగుతోంది. కీలక నేతలు పార్టీకి గుడ్ బై చెబుతున్నారు. ఈ విషయంలో పార్టీ అధిష్టానం సైలెంట్ ఉందన్న విమర్శలు వస్తున్నాయి. కష్టాల్లో ఉంటే పార్టీ తమను పట్టించుకోవడంలేదని పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాభవం... 11 సీట్లకే పరిమితమవ్వడం వైసీపీని కోలుకోలేని దెబ్బతీసింది. 151 సీట్ల నుంచి 11 సీట్లకు పడిపోయిన గ్రాఫ్ ను చక్కదిద్దే పనులు వైసీపీ చేస్తుందా? అంటే లేదనే చెప్పాలి. ఇక తాజా పరిస్థితులు చూస్తుంటే మళ్లీ ఎన్నికల సమయానికి అసలు పార్టీలో ఎవరుంటారో? లేరో? అనే సందేహం కలుగుకుతుంది. ఎన్నికల్లో ఓటమి తర్వాత వైసీపీలో కీలక నేతలంతా సైలెంట్ అవ్వడం, ఒక్కొక్కరిగా పార్టీని వీడుతుండడంతో...పార్టీ పరిస్థితిపై అంతర్గత చర్చ మొదలైందని సమాచారం.వైసీపీ అధినేత వైఎస్ జగన్ కు అత్యంత సన్నిహితుడు విజయసాయిరెడ్డి వైసీపీని వీడడం, రాజకీయాలకు గుడ్ బై చెప్పడం..ఆ పార్టీకి అతిపెద్ద దెబ్బ. ఆయన తర్వాత ఇంకెంత మంది పార్టీని వీడుతారో? అనే సందేహాలు మొదలయ్యాయి. వైసీపీలో ఒకప్పుడు విజయసాయి రెడ్డి నెంబర్ 2గా ఉండేవారు.పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శిగా, చాలా కీలకంగా వ్యవహరించారు. 2019 ఎన్నికల్లో వైసీపీ విజయం సాధించడానికి విజయసాయిరెడ్డి కూడా ఒక కారణంగా చెబుతారు. వైఎస్ జగన్ కుటుంబానికి చాలా సన్నిహితుడైన విజయసాయిరెడ్డి సడెన్ గా రాజకీయాలకు గుడ్ బై చెప్పడం వెనుక పెద్ద కారణమే ఉందనే ప్రచారం జరుగుతోంది.మాజీ మంత్రులు బాలినేని శ్రీనివాసరెడ్డి, అవంతి శ్రీనివాస్, భీమవరం మాజీ ఎమ్మెల్యే గ్రంథి శ్రీనివాస్, మాజీ ఐఏఎస్ ఇంతియాజ్ , వాసిరెడ్డి పద్మ... ఒక్కొక్కరిగా కీలక నేతలు వైసీపీకి గుడ్ బై చెబుతున్నారు. బయట నుంచి ఒత్తిళ్లు, పార్టీలో పరిస్థితులతో వీరంతా



వైసీపీని వీడినట్లు తెలుస్తోంది.వైసీపీ రాజ్యసభ ఎంపీలు ఆర్. కృష్ణయ్య, బీద మస్తాన్ రావు, మోపిదేవి వెంకటరమణ తమ పదవులు, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసి వేరే పార్టీల్లో చేరిపోయారు. రాజ్యసభలో 2024 ఎన్నికల సమయానికి 11 ఎంపీ సీట్లు ఉన్న వైసీపీ బలం క్రమంగా తగ్గుతోంది. విజయసాయి రెడ్డి రాజీనామాతో రాజ్యసభలో వైసీపీ ఎంపీల సంఖ్య 7కు తగ్గింది. త్వరలో మరికొంద మంది విజయసాయిరెడ్డి బాటలో నడుస్తారని తెలుస్తోంది.వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు, పవన్ కల్యాణ్ పార్టీ టైమ్ పొలిటీషియన్స్ అని వైఎస్ జగన్ విమర్శలు చేశారు. వారికి రాష్ట్రంలో కనీసం సొంత ఇల్లు లేదని, హైదరాబాద్ నుంచి రాజకీయాలు చేస్తు?న్నారని విమర్శించారు. వారు ప్రజలకు అందుబాటులో ఉండరని సెటైర్లు వేశారు. అయితే వైసీపీ ఓటమి తర్వాత జగన్ కూడా అదే బాటలో నడుస్తున్నారు. ఆయన తరచూ బెంగళూరు వెళ్లిపోతున్నారు.పార్టీ క్యాడర్, కీలక నేతలకు అందుబాటులో ఉండడంలేదనే విమర్శలు వస్తున్నారు. సంక్రాంతి తర్వాత ప్రజల్లోకి వెళ్తానన్న వైఎస్ జగన్.. ఇంకా తన పర్యటనపై స్పష్టత ఇవ్వలేదు. వైసీపీ కనీసం ప్రతిపక్షంగా కూడా పనిచెయ్యట్లేదనే విమర్శలు వస్తున్నాయి. అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొనకపోవడం, ప్రధాన సమస్యలపై స్పందించకపోవడం, మీడియాకు ముఖం చాటేయ్యడంతో పార్టీని మరింత బలహీనం చేస్తున్నాయని విశ్లేషకులు అంటున్నారు.వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు మైక్ కనిపిస్తే ప్రతిపక్షంపై విరుచుకుపడే నేతలంతా ఒక్కసారిగా సైలెంట్ అయిపోయారు. కొడాలి నాని, జోగి రమేష్, పేర్ని నాని, సజ్జల రామకృష్ణారెడ్డి, ఆర్కే రోజా, అంబటి రాంబాబు..ఇలా కీలక నేతలంతా మౌనం వహిస్తు?న్నారు. అంబటి రాంబాబు, ఆర్కే రోజా అడపాదడపా మీడియా ముందుకు వస్తున్నా...గతంలో ఉన్నంత వాడి, వేడి వీరి వ్యాఖ్యల్లో కనిపించడంలేదు.కొడాలి నాని, జోగి రమేష్, పేర్ని నాని అయితే పూర్తిగా సైలెంట్ అయ్యారు. పార్టీలో పరిస్థితులను అధిష్టానం నిశితంగా పరిశీలిస్తుందని ఆ పార్టీ నేతలు అంటున్నారు. త్వరలోనే జగన్ రంగంలోకి దిగుతారని పార్టీ నేతలు అంటున్నారు. జగన్ విదేశాల నుంచి తిరిగి రాగానే పరిస్థితులను చక్కదిద్దుతారని చెబుతున్నారు.

# అమరావతిలో ఎయిర్ పోర్టు, స్టేడియం

**విజయవాడ, జనవరి 27, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికే గన్నవరం (విజయవాడ), విశాఖపట్నం, తిరుపతి, కర్నూలు, రాజమండ్రిలో ఎయిర్‌పోర్టులు ఉన్నాయి. వీటి ద్వారా విమానాల రాకపోకలు సాగుతున్నాయి. అయితే.. ఎయిర్ కనెక్టివిటీని మరింత పెంచాలని కూటమి ప్రభుత్వం ప్లాన్ చేస్తోంది. ఇందులో భాగంగానే మరో కొత్త విమానాశ్రయాన్ని నిర్మించాలని భావిస్తోంది.సీఆర్డీఏ పరిధిలో 3,000 నుంచి 5,000 ఎకరాల విస్తీర్ణంలో కొత్త విమానాశ్రయాన్ని నిర్మించేందుకు ప్రభుత్వం ప్లాన్ చేస్తున్నట్టు తెలుస్తోంది. మంత్రి నారా లోకేష్, ప్రభుత్వ అధికారులు ఎయిర్ ఇండియాతో సహా అనేక కంపెనీల ప్రతినిధులతో దావోస్‌లో సమావేశమయ్యారు. విమానాశ్రయ నిర్మాణం ప్రణాళికలపై చర్చించారు. దీంతో కొత్త ఎయిర్‌పోర్ట్ నిర్మాణం అంశం తెరపైకి వచ్చింది.ఈ కొత్త విమానాశ్రయాన్ని అమరావతికి అతి సమీపంలో నిర్మించడానికి ప్లాన్ చేస్తున్నట్టు తెలుస్తోంది. ఈ ప్రాంతంలో గన్నవరం విమానాశ్రయం ఉంది. ఇది విజయవాడ నుంచి 21.3 కిలోమీటర్ల దూరంలో ఉంది. విశాఖపట్నం వెళ్లే జాతీయ రహదారి పక్కనే ఎయిర్‌పోర్ట్ ఉంది. అయితే.. ఈ జాతీయ రహదారి నిత్యం రద్దీగా ఉంటోంది. ఇక్కడికి చేరుకోవడం కష్టంగా మారుతోంది. ఈ నేపథ్యంలో.. భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బంది లేకుండా కొత్త ఎయిర్‌పోర్ట్‌ను నిర్మించాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలుస్తోంది.కొత్త విమానాశ్రయాన్ని అమరావతికి సమీపంలో ప్లాన్ చేయడానికి చాలా కారణాలు ఉన్నాయి. ప్రస్తుతం అమరావతిలో మళ్లీ పనులు జరుగుతున్నాయి. ఇక్కడ భూములు సరిపడా అందుబాటులో ఉన్నాయి. ఎయిర్‌పోర్ట్ నిర్మిస్తే.. వివిధ కంపెనీలు తమ కార్యాలయాలను అమరావతిలో ఏర్పాటు చేస్తారని ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలుస్తోంది. మరోవైపు భూముల ధరలు కూడా భారీగా పెరిగే అవకాశం ఉందిఅమరావతి ప్రాంతంలో ఎయిర్‌పోర్ట్‌ను నిర్మిస్తే.. ఇక్కడ ఎలాంటి రద్దీ ఉండదు కాబట్టి వేగంగా పనులు జరిగే అవకాశం ఉంది. పక్కా ప్రణాళికతో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో నిర్మాణం చేపట్టవచ్చు. అలాగే రాజధానిలో విమానాశ్రయం ఉంటుంది. అమరావతికి వచ్చేవారు నేరుగా చేరుకోవచ్చు. అమరావతి అభివృద్ధి కూడా వేగంగా జరిగే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

### భారీ స్టేడియం

తెలుగు రాష్ట్రాల్లో క్రికెట్ అభిమానులకు ఏపీ ప్రభుత్వం తీసుకున్న ఓ నిర్ణయం.. మంచి కిక్ ఇస్తోంది. సకల వసతులతో, అన్ని హంగులతో తీర్చిదిద్దాలని భావిస్తున్న రాజధాని అమరావతిలో దేశంలోనే అతిపెద్ద క్రికెట్ స్టేడియం నిర్మించాలని నిర్ణయించింది. ఈ మేరకు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ? ఏసీఏ అధ్యక్షు?, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ ప్రకటించారు. ఇప్పటికే.. ఈ ప్రాజెక్టుకు సంబంధించి అనేక ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపిన ఆయన.. కూటమి ప్రభుత్వం అధికారం ముగిసి ఎన్నికలకు వెళ్లే లోపుగానే జాతీయ స్థాయిలో అతిపెద్ద క్రికెట్ స్టేడియం రూపుదిద్దుకుంటుందని అన్నారు. ఇప్పుడు ఈ వార్త తెలుగు రాష్ట్రాల్లో, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ లోని యువతకు ఆనందాన్ని కలిగిస్తోందిఏపీ రాజధాని అమరావతిని అంచనాలకు మించి రూపొందించాలని, అక్కడ అభివృద్ధి పనుల్ని పరుగులు పెట్టించాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన నిర్మాణాలతో పాటు మిగతా వనరుల్ని ఏర్పాటు చేయాలని భావిస్తోంది. ఇందులో భాగంగా.. రెండు వందల ఎకరాల్లో స్పోర్ట్స్ సిటీని నిర్మాంచాలని ప్రణాళికలు రచిస్తోంది. ఆ స్పోర్ట్స్ సిటీలోనే ఈ భారీ స్టేడియాన్ని నిర్మించాలని ఆలోచిస్తున్న ఆంధ్రా క్రికెట్ అసోషియేషన్.. ఈ స్టేడియం కోసం 60 ఎకరాలు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం కూడా సానుకూలంగా స్పందిస్తే.. విశాఖలోని ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియానికి దీటుగా తీర్చిదిద్దుతామని అంటున్నారు.దేశంలో ఇప్పటి వరకూ అతి పెద్ద క్రికెట్ స్టేడియం గుజరాత్ లోని అహ్మదాబాద్ లో ఉంది. దీని సిట్టింగ్ సామర్థ్యం 1.10 లక్షలు. కాగా.. ఈ స్టేడియం కంటే పెద్దగా, సిట్టింగ్ సామర్థ్యం 1.25 లక్షలతో అమరావతిలోని స్టేడియాన్ని తీర్చిదిద్దాలన ఏపీ ప్రభుత్వం భావిస్తోంది. ఇటీవలే స్టేడియాన్ని పరిశీలించిన ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు, విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని (శివనాథ్).. స్టేడియంలో ప్రస్తుతానికి చేపట్టాల్సిన మౌలిక వసతుల కల్పనకు ఏసీఏ నిధులు కేటాయిస్తామని ప్రకటించారు. అతిపెద్ద క్రికెట్ స్టేడియం నిర్మాణానికి బీసీసీఐ నుంచి సైతం ఆర్థిక సాయం కోరతామని తెలిపిన? ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ బోర్డు.. స్థానికంగా బోర్డు నుంచి కొంత మేర సమీకరిస్తామని తెలిపింది.అన్ని రకాల హంగులతో అమరావతిని నిర్మించాలని భావిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. క్రీడలకు సైతం మంచి అవకాశాలు కల్పిస్తుందని తెలిపారు. అమరావతిలో వేగం పుంజుకున్న పనులు.. కూటమి నేతల హయాంలోనే ఓ రూపుదిద్దుకుంటాయని ప్రకటించారు. అమరావతిలో 2029 జాతీయ క్రీడలు నిర్వహించడానికి బిడ్ వేయనున్నట్లు ఆంధ్రా క్రికెట్ అసోషియేషన్ ప్రకటించింది. రాష్ట్రంలో క్రికెట్ అభివృద్ధికి విశేష చర్యలు తీసుకుంటామని ప్రకటించిన ఎంపీ కేశినేని.. క్రికెట్ కోసం రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేకంగా మూడు అకాడమీలను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల క్రికెట్ అభిమానులకు అందుబాటులో ఉండేలా.. ఉత్తరాంధ్ర, విజయవాడ, రాయలసీలో ఈ అకాడమీలు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. అవసరమైతే.. వీటిన నిర్వహణకు మిథాలీ రాజ్, రాబిన్ సింగ్ వంటి ప్రముఖుల్ని తీసుకు వస్తామని తెలిపారు.వారి ఆధ్వర్యంలో క్రికెట్ శిక్షణ కార్యక్రమం కొనసాగుతుందని చెప్పారు.

## గేమ్ మొదలైనట్టేనా....


**విజయవాడ, జనవరి 26, పెన్ పవర్:** అనుకోని ఘటనలు ఏపీ రాజకీయాల్లో జరుగుతున్నాయి. ఊహించని ట్విస్ట్ లు చోటు చేసుకుంటున్నాయి. బిగినింగ్ లోనే ఇలా ఉంటే.. ఎండింగ్ ఎలా ఉంటుందన్నది ఇప్పుడు అందరినీ ఆశ్చర్యపరుస్తున్న అంశం. ఎందుకంటే కరడుగట్టిన వైసీపీ నేత



విజయసాయిరెడ్డి రాజీనామాతో ఇక ఏం జరిగినా పెద్దగా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు. దీనిపై సోషల్ మీడియాలో అనేక కామెంట్స్ వినపడుతున్నాయి. జగన్ మళ్లీ జైలుకు వెళ్లే సమయం దగ్గరపడిందన్న సంకేతాలు బలంగా వినిపిస్తున్నాయి. కనిపిస్తున్నాయి కూడా. జగన్ ను జైల్లో వేస్తే వైసీపీ అస్సలు ఉండదన్న అంచనాలో ప్రత్యర్థి పార్టీల అగ్రనేతలున్నారు. కేవలం ఒక్కసారి ఓటమితోనే అనేక మంది నేతలు పార్టీని వీడుతుండటంతో ఇక ఈసారి జైలుకెళితే ఒక్కరూ మిగలరన్న అంచనాల్లో అధినాయకులు ఉన్నట్లే కనిపిస్తుంది. వైఎస్ జగన్ గతంలో జైలుకు వెళ్లినప్పుడు పరిస్థితులు వేరు. ఇప్పుడు వేరు అని లెక్కలు వేసుకుంటున్నారు. అప్పుడు వచ్చిన సింపతీ ఇప్పుడు రాకపోవచ్చన్న గణాంకాలతో సహా కొందరు చెబుతున్నారు. అంజనం వేసి మరీ చూడాల్సిన అవసరం లేదని, ప్రజలతో పాటు క్యాడర్ కూడా ఈసారి జగన్ వెంట నడిచే అవకాశం లేకపోవచ్చన్న ధీమా వారిలో కనపడుతుంది. జగన్ కేసులు చివరి దశకు చేరుకున్నాయి. అనేక కేసులు ఆయనను ఇబ్బంది పెట్టే విధంగా ఉన్నాయి.ఆ కేసులు న్యాయపరంగా నిలబడతాయా? లేదా? అన్నది పక్కన పెడితే కొంతకాలం జైలు జీవితం జగన్ గడపక తప్పదని అంటున్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు యాభై మూడు రోజుల పాటు స్కిల్ డెవలెప్ మెంట్ కేసులో రాజమండ్రి జైలులో ఉన్నారు. జగన్ ను జైలుకు పంపడంలో భాగంగానే ఈ రాజీనామాలంటూ పెద్దయెత్తున సోషల్ మీడియాలో చర్చ జరుగుతుంది. జగన్ పక్కన ఉన్న వారిని ముందు బయటకు పంపి, ఒంటరిని చేసిన తర్వాత జగన్ ను జైలుకు పంపితే రాజకీయంగా ఎలాంటి ఇబ్బందులు ఎదురు కావన్న భావనలో ఉన్నారు. పార్టీని లీడ్ చేసే వారిని ఒక్కొక్కరిని పార్టీ నుంచి బయటకు పంపి తర్వాత జగన్ ను జైలు కు పంపాలన్న భావన కనపడుతుందని వైసీపీ సీనియర్ నేత ఒకరు వ్యాఖ్యానించారు. అయితే జనంలో వచ్చే సానుభూతి వెల్లువను ఎవరూ ఆపలేరంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు కూడా సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. జగన్ జైలుకెళితే ఏపీలో రాజకీయ ముఖచిత్రం మారిపోతుందన్న అంచనాలు కూడా సోషల్ మీడియాలో పెద్దయెత్తున వినిపిస్తున్నాయి ఏపీలో బీజేపీ, జనసేన పార్టీ బలం పెంచుకోవడానికి ఇది ఒక మార్గమని కొందరు వ్యాఖ్యానిస్తున్నారు. ఇది కూటమి పార్టీలోని బీజేపీ ఆడుతున్న గేమ్ లో భాగమేనంటూ కొందరు పోస్టింగ్ లు పెడుతున్నారు. ఢిల్లీ స్థాయిలో జరుగుతున్న గేమ్ లో భాగంగానే విజయసాయిరెడ్డి రాజీనామా చేశారంటూ అనేక మంది అభిప్రాయపడుతున్నారు. అయితే ఈ సెగ కేవలం జగన్ తోనే ఆగిపోదని, చంద్రబాబు పార్టీ కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కొందరు టీడీపీ సానుభూతి పరులు నెట్టింట సూచిస్తున్నారు. ఢిల్లీ టీం ను గుడ్డిగా నమ్మితే అంతకంటే పెద్ద జోక్ మరేదీ ఉండదని, దేశంలో జరుగుతున్న పరిణామాలను చూసైనా చంద్రబాబు జాగ్రత్తలు పాటించాలని పలువురు ఇప్పటికే తమ సూచనలు అందచేస్తున్నారు. మొత్తం మీద ఏపీలో ఏదో జరుగుతుందన్నది మాత్రం తెలుస్తుంది. కానీ అది ఏంటన్నది మాత్రం ఎప్పటికప్పుడు సస్పెన్స్ గానే కొనసాగుతుంది.

## ఎవరిది పై చేయి... లోకేష్ వర్సెస్ పవన్

**విజయవాడ, జనవరి 27, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు ఎప్పటికప్పుడు మారుతుంటాయి. ఒక ఏడాది ఉన్న తీరుగా మరొక ఏడాది ఉండే అవకాశం లేదు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన ఏడాది సమయంలోనే అనేక విషయాలు రాజకీయంగా చోటు



చేసుకున్నాయి. ఉప ముఖ్యమంత్రి పదవిని లోకేష్ కు ఇవ్వాలంటూ డిమాండ్ పెద్ద సౌండ్ పార్టీ నేతల నుంచి వినిపించడం, దానిని చంద్రబాబు స్వయంగా ఆఫ్ చేయడంతో కొంత మేరకు వివాదం సద్దుమణిగిందనే అనుకోవాలి. ఎందుకంటే ఈ నినాదం సద్దుమణగడం తాత్కాలికమేనని అందరికీ తెలుసు. ఎందుకంటే నారా లోకేష్ ను ప్రతి టీడీపీ కార్యకర్త తమ భవిష్యత్ నేతగానే భావిస్తున్నారు. అలాగే ఎప్పటి నుంచో చూస్తున్నారు. అయితే ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ఉన్నంత కాలం అది జరగదన్నది కూడా పార్టీ నేతలకు తెలుసు. ఎందుకంటే ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఒకే వర్గానికి చెందిన వారికి ఇచ్చే సంప్రదాయం ఆంధ్రప్రదేశ్ లో లేకపోవడమే. పవన్ కల్యాణ్ కూడా అగ్రకుల సామాజికవర్గమే కావడంతో మరో ఉప ముఖ్యమంత్రి పదవి మాత్రం మరో అగ్రకులానికి ఇచ్చే అవకాశం లేదు. అందుకు చంద్రబాబు సుతారమూ అంగీకరించరు. అందుకే ఆ నినాదాన్ని ఆదిలోనే చంద్రబాబు సమర్థవంతంగా తుంచి వేయగలిగారు. అయితే ఎవరూ కాదనలేని వాస్తవం మాత్రం చంద్రబాబు తర్వాత పార్టీ పగ్గాలు చేపట్టేది లోకేష్ మాత్రమేనని అందరూ ఆ నినాదాన్ని అందుకున్నారన్నది అందరికీ తెలిసింది.. మరోవైపు పవన్ కల్యాణ్ కూడా ఈ ప్రతిపాదనకు ఒప్పుకునే అవకాశం లేదు. ఎందుకంటే రాజకీయాల్లో చంద్రబాబు తన కంటే చాలా సీనియర్. నాలుగు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేశారు. రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబుతో పవన్ కల్యాణ్ తనను తాను పోల్చుకోను కూడా పోల్చుకోరు. అందుకే శాసనసభ సాక్షిగా పవన్ కల్యాణ్ మరో పదేళ్ల పాటు చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండాలని కోరుకున్నారు. మరో ఉప ముఖ్యమంత్రి పదవిని వేరొకరికి ఇస్తే తన అభిమానులతో పాటు, సొంత సామాజికవర్గం నుంచి కూడా ఆయన పట్ల వ్యతిరేకత వ్యక్తమవుతుంది. అందుకే ఈ విషయంలో మౌనంగా ఉన్న పవన్ కల్యాణ్ చంద్రబాబు చేతనే ఆ నినాదాన్ని తాత్కాలికంగా ఆపగలిగారు. అయితే ఇద్దరూ వయసులో చిన్న వారే. రాజకీయంగా ఇద్దరికీ భవిష్యత్ ఉంది. రెండు పార్టీలూ ఆంధ్రప్రదేశ్ లో కలసి పోటీ చేయాల్సిన అవసరాన్ని కూడా ఇద్దరూ గుర్తించాల్సి ఉంది. అదే సమయంలో ఇద్దరూ పోటీ పడితే విడిపోయి పడిపోతామని కూడా ఇద్దరికీ తెలియంది కాదు. అందుకే పట్టుబట్టరు. అలాగని పట్టువిడుపులకు పోరు. ఎవరి పంథా వారిదే. ఎవరి ఆలోచనలు వారివే. వీరిద్దరినీ సమతూకంగా రాజకీయంగా ముందుకు తీసుకెళ్లే బాధ్యత చంద్రబాబు చేతుల్లోనే ఉంది. చంద్రబాబు ఎవరి పక్షమో వహించే వీలు లేదు. అయితే ఇది దీర్ఘకాలంగా పనిచేయదని, భవిష్యత్ లో ఈ ఇద్దరి నేతల మధ్య పోటీ తప్పదన్న విశ్లేషణలు సోషల్ మీడియాలో బాగా వినపడుతున్నాయి. జనసేన నేతలు కూడా ఇదేరకమైన పోస్టింగ్ లు నెట్టింట వైరల్ అవుతున్నాయి...

## బస్సు బోల్తా.. 15 మందికి గాయాలు

**కడప పెన్ పవర్:** దువ్వూరు మండలం గుడిపాడు వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. వేగంగా వస్తున్న బస్సు అదుపుతప్పి డివైడర్ను ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 15 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. హైదరాబాద్ నుంచి చిత్తూరు వెళ్తుండగా ఈ బస్సుకు ప్రమాదం జరిగింది. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## పాకిస్థాన్‌కు విండీస్ దిమ్మతిరిగే షాక్... పాక్ గడ్డపై 35 ఏళ్ల తర్వాత కరేబియన్ జట్టు అద్భుత విజయం

ముల్తాన్ వేదికగా వెస్టిండీస్, పాకిస్థాన్ రెండో టెస్టు

120 పరుగుల తేడాతో ఘన విజయం సాధించిన కరేబియన్ జట్టు

ఈ విజయంతో రెండు టెస్టు మ్యాచ్ ల సిరీస్ 1-1తో సమం

చివరిసారిగా పాకిస్థాన్ గడ్డపై 1990లో టెస్టు మ్యాచ్‌లో గెలిచిన విండీస్



**హైదరాబాద్ పెన్ పవర్:** ముల్తాన్ వేదికగా వెస్టిండీస్‌తో జరిగిన రెండో టెస్టులో ఆతిథ్య పాకిస్థాన్‌కు ఊహించని షాక్ తగిలింది. సొంత గడ్డపై పాక్ పరాజయం పాలైంది. పాకిస్థాన్‌ను కరేబియన్ జట్టు 120 పరుగుల తేడాతో ఓడించింది. దీంతో 35 ఏళ్ల తర్వాత పాక్ గడ్డపై విండీస్ అద్భుత విజయాన్ని నమోదు చేసింది. ఇంతకుముందు చివరిసారిగా పాకిస్థాన్ గడ్డపై వెస్టిండీస్ 1990లో గెలిచింది. ఫైసలాబాద్ వేదికగా జరిగిన ఆ మ్యాచ్‌లో కరేబియన్ జట్టు విజయం సాధించింది. ఆ తర్వాత 1997, 2006లో అక్కడ పర్యటించిన విండీస్‌కు ఒక్క విజయం కూడా దక్కలేదు. అలా 35 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ ఈరోజు పాక్ గడ్డపై సూపర్ విక్టరీని నమోదు చేసింది. ఈ మ్యాచ్‌లో విండీస్ తొలి ఇన్నింగ్స్ లో 163 రన్స్ చేయగా... పాక్ 154 పరుగులకే కుప్పకూలింది. ఆ తర్వాత 9 పరుగుల స్వల్ప ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కరేబియన్ జట్టు 244 రన్స్ చేసింది. మొత్తంగా ఆతిథ్య జట్టుకు 254 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. అయితే, పాక్ రెండో ఇన్నింగ్స్ లో కేవలం 133 రన్స్‌కే పరిమితమైంది. దీంతో విండీస్ 120 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఇక విజయంతో రెండు టెస్టు మ్యాచుల సిరీస్ 1-1తో సమం అయింది. మొదటి టెస్టులో పాకిస్థాన్ విజయం సాధించిన విషయం తెలిసిందే.

## మీరు ఎప్పటికీ రిటైర్ అవ్వొద్దు.. రోహిత్‌కు 15 ఏళ్ళ అభిమాని ఎమోషనల్ లెటర్



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా టెస్ట్ కెప్టెన్ రోహిత్ శర్మ ప్రస్తుతం పేలవ ఫామ్ లో కొనసాగుతున్నాడు. అంతర్జాతీయ క్రికెట్ లోనే కాదు దేశవాళీ క్రికెట్ లోనూ హిట్ మ్యాన్ చెత్త ఫామ్ కొనసాగుతుంది. ఫామ్ కోసం రంజీ ట్రోఫీ బాట పడితే రెండు ఇన్నింగ్స్ ల్లోనూ ఘోరంగా విఫలమయ్యాడు. ఇటీవలే జమ్మూ కాశ్మీర్ తో జరిగిన మ్యాచ్ లో తొలి ఇన్నింగ్స్ లో 3 పరుగులే చేసిన రోహిత్.. రెండో ఇన్నింగ్స్ లో 28 పరుగులతో సరిపెట్టుకున్నాడు. 10 సంవత్సరాల సుదీర్ఘ విరామం తర్వాత రంజీ ట్రోఫీకి తిరిగి వచ్చిన తర్వాత కూడా అతని అదృష్టం మారలేదు. ముంబై, భారత జట్టుకు కెప్టెన్ గా ఇలాంటి ప్రదర్శన అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు.

15 ఏళ్ళ అభిమాని ఎమోషనల్ అవుతూ రోహిత్ కు రాసిన లెటర్ ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. “ క్రికెట్ లాంటి అద్భుతమైన క్రీడ చూడడానికి నా అభిమాన ఆటగాడు రోహిత్ కారణం. ఈ యుగంలో నేను పుట్టడం.. నీ క్లాస్ బ్యాటింగ్ ను చూడడం నా అదృష్టం. మీరు నా ఆరాధ్య దైవం. ఫామ్ తాత్కాలికం. క్లాస్ శాశ్వతం. మీరు ఈ మధ్య కాలంలో బిగ్ ఇన్నింగ్స్ ఆడకపోయినా పర్వాలేదు. మీరు త్వరలోనే ఫామ్ లోకి వస్తారని ఆశిస్తున్నా. నిన్న మీరు కొట్టిన మూడు సిక్సర్లు అద్భుతం. నేను మ్యాథ్స్ క్లాస్ లో కూర్చొని మీ బ్యాటింగ్ చూసాను. ద్వేషించే వారు ఎప్పటికీ ద్వేషిస్తూనే ఉంటారు. కానీ మీ నాయకత్వ లక్షణాలు అద్భుతం. కెప్టెన్ గా ప్లేయర్ గా రెండు విభాగాల్లో మీరు విజయం సాధించారు. మీ కోసం నేను ప్రతి మ్యాచ్ చూస్తా. దయచేసి ఎప్పటికీ రిటైర్ కావద్దు. రాబోయే ఛాంపియన్స్ ట్రోఫీలో మీరు ప్రత్యర్థి జట్లను చీల్చివేస్తారని భావిస్తున్నాను. స్పోర్ట్స్ అనలిస్ట్ కావాలనేది నా కల. నేను రాజస్థాన్ రాయల్స్‌తో కలిసి ఇంటర్న్‌షిప్ కూడా పూర్తి చేసాను. త్వరలో మీరు ఫామ్ లోకి తిరిగి రావాలని కోరుకుంటున్నాను”. అని ఛబ్రియా అనే అభిమాని లెటర్ ను ముగించాడు.

## ‘ఐసీసీ టెస్ట్ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ 2024’.. అట్లుంటది బుమ్రాతోని..!




**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా స్టార్ బౌలర్ జస్ప్రిత్ బుమ్రా అరుదైన ఘనత సొంతం చేసుకున్నాడు. ‘ఐసీసీ మెన్స్ టెస్ట్ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ 2024’కు ఎంపికై క్రికెట్ చరిత్రలోనే సరికొత్త అధ్యాయాన్ని లిఖించాడు. ఈ అవార్డు దక్కించుకున్న తొలి బౌలర్ బుమ్రానే కావడం గమనార్హం. 2018లో చివరిగా టీమిండియా స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీకి దక్కిన ఈ గౌరవం మళ్లీ బుమ్రా రూపంలో టీమిండియాకు దక్కింది. 2024 టెస్ట్ క్రికెట్‌లో 14.92 యావరేజ్‌తో 71 వికెట్లు తీసి బుమ్రా సత్తా చాటడంతో ఈ అవార్డు దక్కింది. సొంతగడ్డపై ఇంగ్లండ్, బంగ్లాదేశ్ జట్లపై టీమిండియా విజయం సాధించడంలో.. ఓవర్సీస్‌లో ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా జట్లతో జరిగిన టెస్ట్ మ్యాచుల్లో అద్భుతమైన బౌలింగ్‌తో రాణించి బుమ్రా శభాష్ అనిపించుకున్నాడు. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో తీవ్ర ఒత్తిడి ఉన్న సందర్భంలో కూడా ఐదు మ్యాచుల్లో 32 వికెట్లు తీసి ‘ప్లేయర్ ఆఫ్ ది సిరీస్’గా బుమ్రా నిలిచాడు. ఐసీసీ మెన్స్ టెస్ట్ క్రికెట్ బౌలర్ ర్యాంకింగ్స్‌లో కూడా బుమ్రానే నంబర్ 1 స్థానంలో నిలవడం విశేషం.ఇంగ్లండ్ క్రికెటర్స్ హ్యారీ బ్రూక్, జో రూట్ తో పాటు శ్రీలంక క్రికెటర్ కమిందు మెండిస్ ‘ఐసీసీ మెన్స్ టెస్ట్ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ 2024’ కోసం పోటీ పడినప్పటికీ బుమ్రా అద్భుతమైన ఆట తీరుతో రాణించి, వీరిని అధిగమించి రికార్డు సృష్టించాడు.‘ఐసీసీ మెన్స్ టెస్ట్ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ 2024’ దక్కడం పట్ల వరల్డ్ క్రికెట్‌లోనే దిగ్గజ బౌలర్ అయిన బుమ్రా హర్షం వ్యక్తం చేశాడు. ఈ అవార్డు కేవలం తన వ్యక్తిగత ప్రతిభ వల్ల మాత్రమే దక్కలేదని, తోటి క్రికెటర్లు, కోచ్ లు అందించిన తోడ్పాటు, అభిమానుల మద్దతు వల్లే ఇది సాధ్యమైందని బుమ్రా తెలిపాడు. టెస్ట్ క్రికెట్ తన హృదయానికి ఎంతో దగ్గరైన ఫార్మాట్ అని, ఈ అవార్డ్ తనకెంతో ప్రత్యేకమైందని బుమ్రా సంతోషం వ్యక్తం చేశాడు. ఇక.. టీమిండియా మహిళల జట్టుకు కూడా స్మృతి మందాన రూపంలో గౌరవం దక్కింది. ‘ఐసీసీ ఉమెన్స్ ఓడీఐ(%ాణ×%) క్రికెటర్ ఆఫ్ ది ఇయర్’గా స్మృతి మందాన నిలిచింది.

## బాలయ్య హీరోయిన్ సొగసైన ప్రదర్శన



## ‘దేవర’ లెక్క ప్రశాంత్ నీల్ సరి చేస్తాడా?



ఆర్ ఆర్ ఆర్ చిత్రంలో యంగ్ టైగర్ ఎన్టీఆర్ కొమరం భీమ్ పాత్రలో? రాజమౌళి ఏ రేంజ్ లో ఆవిష్కరించాడో చెప్పా ల్సిన పనిలేదు. అందులో అల్లూరి సీతారామరాజు పాత్రతో సరిపోల్చితే కాస్త భీమ్ రోల్ వీక్ గా ఉన్నా? తారక్ ని తెరపై చూపించినంత సేపు ఓ హై తీసుకు రాగలిగాడు జక్కన్న. చరణ్- తారక్ ఎంట్రీ బ్రిడ్జి సన్నివేశం గానీ, బ్రిటీష్ సామ్రాజ్యంలోకి అడవి మృగాలతో తారక్ దాడి చేసే సన్నివేశాలు గానీ తారక్ ఇమేజ్ ని అమాతం రెట్టింపె చేసిన సన్నివేశాలే అవన్నీ.క్లైమాక్స్ లో అదే తారక్ ని కాస్త వీక్ గా చూపించడంతో? థియేటర్లో కుర్చీలు విరిగిన సంగతి తెలిసిందే. అలాంటి తారక్ ని %-%దేవర%-%లో కొరటాల శివ ఆవిష్కరించిన తీరు మాత్రం కొంత నిరుత్సాహ పరిచింది. సినిమాకి డివైడ్ టాక్ రావడానికి ఇదీ ఓ కారణం. సినిమా కాన్సెప్ట్ పక్కనబెడితే? తారక్ లో హై ఓల్టేజ్ ఎనర్జీని కొరటాల సరిగ్గా ఎగ్జిక్యూట్ చేయలే కపోయాడు? అన్న విమర్శ తెరపైకి వచ్చింది. హీరో ఎలివేషన్ సన్నివేశాలు ఏమాత్రం హై తీసుకు రాలేకపోయాయి అన్నది వాస్తవం.

ఓ సాధారణ సినిమా లాగే అనిపించింది. అయితే ఇప్పుడా లెక్కలన్నింటిని ప్రశాంత్ నీల్ సరిచేయాల్సి ఉంది. ప్రస్తుతం ఎన్టీఆర్ హీరోగా ప్రశాంత్ వర్మ %-%డ్రాగన్%-% అనే పాన్ ఇండియా చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. ప్రశాంత్ గత చిత్రాలు %-%కేజీఎఫ్%-% లో యశ్ రోల్, %-%సలార్%-% లో ప్రభాస్ ని ఏ రేంజ్ లో చూపించాడో తెలిసిందే. ఓ సరికొత్త ప్రపంచాన్నే చూపించి హీరో పాత్రలను నెక్ట్స్ లెవల్ కి తీసుకెళ్లాడు. బలమైన కథా నేపథ్యంతో పాటు పాత్రల్ని కూడా అంతే బలంగా రాసుకుని హీరో పాత్రని మరింత హైలో తీర్చిదిద్దడంలో? ప్రశాంత్ నీల్ రాజమౌళి కన్నా రెండు ఆకులు ఎక్కువే చదివాడు అన్న ప్రశంస అందుకున్నాడు.ఇప్పుడు తారక్ ని కూడా అదే రేంజ్ లో చూపిస్తాడు? అన్న అంచనాలు భారీగా ఉన్నాయి. ప్రశాంత్ నీల్ స్టోరీ నేపథ్యాన్ని ఎలాంటిది తీసుకున్నా హీరో పాత్రని మాత్రం సాలిడ్ గానే చూపిస్తాడు. విజువల్ గా హీరో పాత్ర ఎంతో ఎగ్జైట్ మెంట్ తోనే సాగుతుందని భావిస్తున్నారు. మయన్మార్ -భూటాన్ నేపథ్యంలో సాగే స్టోరీ అని ప్రచారంలో ఉంది. ఆ నేపథ్యాన్ని బేస్ చేసుకుని తారక్ రోల్ డిజైన్ చేసి ఉంటాడని తెలుస్తోంది.

## ఆమ్నా షరీఫ్ శైలి స్వచ్ఛమైన గాలి



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com